## విలేఖరులు కావలెను

పత్రికా రంగం లో సరికొత్త సంచలనం..
మా జన సముద్రం..
ప్రతి అక్షరం జనం కోసం మా నినాదం..
అనుక్షణం ప్రజా ప్రయోజనమే మరియు
సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగనున్న
మా పత్రిక లో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్
మరియు తెలంగాణ జిల్లాలు,మండలాల వారీగా
విలేఖరులు కావలెను..సామాజిక స్పృహ,వార్తల
సేకరణ పట్ల మక్కువ.. నిజాయితీ ఇవే మా
విలేఖరులకు ఉండవలసిన ముఖ్య అర్హతలు..!
సంప్రదించండి.. 9494184136



RNI NO:APTEL16151

# జనసముద్రం న్యూస్

నిరంతర వార్తా ప్రవాహం

ప్రతి అక్షరం జనం కోసం

Save Farmers

JANASAMUDRAM.COM

సంపుటి:05 | సంచిక:12 | ఆదివారం సెప్టెంబర్ 27,2026 | ఎడిటర్: వేణు గోపాల్ రెడ్డి | పేజీలు:08 | వెల.రూ. 2.00


## 'సర్' నోటీసులు..

అత్యవసరమైతే తప్ప వ్యక్తిగత విచారణకు రానక్కర్లేదు: ఈసీ

- 'సర్' నోటీసులు అందుకున్న వారికి ఊరట
- అత్యవసరమైతే తప్ప వ్యక్తిగత విచారణకు రావాల్సిన అవసరం లేదు
- ఫారం-6 డిక్లరేషన్‌ను సుప్రీంకోర్టు సమర్థించిందని ఈసీ వెల్లడి
- 20 రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల్లో 'సర్' ప్రక్రియ పూర్తి
- పేర్లు లేని అర్హులు ఫారం-6తో దరఖాస్తు చేసుకోవచ్చు
- యువత, తొలిసారి ఓటర్ల నమోదుకు ప్రత్యేక డ్రైవ్




2లో

## వారిని కాదు.. ధైర్యముంటే నన్ను అడ్డుకోండి:

పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ భాజపాపై తీవ్ర విమర్శలు గుప్పించారు. సెరాంపుర్‌లో జరగాల్సిన తన ర్యాలీకి వెళ్లకుండా తమ వర్గం నేతలను భాజపా గూండాలు అడ్డుకున్నారని ఆరోపించారు. కొందరిని గృహ నిర్బంధం చేశారని..మరికొందరిని దారిలో అడ్డుకొని, వాహనాలు ధ్వంసం చేశారని పేర్కొన్నారు.



2లో

## సైబర్ ముప్పులపై అప్రమత్తత అవసరం:

సైబరాబాద్ పోలీస్ కమిషనర్



2లో

## మద్యం షాపులకు అక్టోబరు 5న డ్రా: మంత్రి కొల్లు రవీంద్ర




మిగతాది 2లో

విశాఖపట్నం: ఆధార్ కార్డు ఉంటే చాలు.. ఎవరైనా మద్యం షాపు లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. శనివారం విశాఖలో ఆయన మీడియాతో మాట్లాడారు. అక్టోబరు 5న డ్రా తీసి దుకాణాలు

# ద్వారకాతిరుమల ఆలయంలో

### సంప్రదాయ దుస్తులపై అవగాహన కల్పించాలి

**భక్తుల విజ్ఞప్తి.. ప్రధాన ప్రవేశ ద్వారాల వద్ద ప్రత్యేక సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని అభ్యర్థన**






**జనసముద్రం న్యూస్ । ఏలూరు జిల్లా । సెప్టెంబర్ 26 । ద్వారకాతిరుమల**

ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో ఆధ్యాత్మిక వాతావరణం, ఆలయ సంప్రదాయాలకు అనుగుణంగా భక్తుల వస్త్రధారణపై మరింత అవగాహన కల్పించాలని భక్తులు కోరుతున్నారు.ఆలయానికి ప్రతిరోజూ వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తుండటంతో, ఆలయ ప్రధాన ప్రవేశ ద్వారాలు, క్యూ లైన్లు, ఇతర ముఖ్య ప్రదేశాల్లో సంప్రదాయ దుస్తులపై స్పష్టమైన సూచనలు, అవగాహన బోర్డులు ఏర్పాటు చేయాలని భక్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.ఆలయ పవిత్రతను గౌరవిస్తూ భక్తులు మర్యాదపూర్వకంగా, సంప్రదాయబద్ధమైన వస్త్రధారణతో స్వామివారి దర్శనానికి వచ్చేలా అవగాహన కల్పిస్తే ఆలయ ఆధ్యాత్మిక వాతావరణం మరింత చక్కగా కొనసాగుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.ఇతర ప్రముఖ దేవాలయాల్లో అమలవుతున్న వస్త్రధారణకు సంబంధించిన మార్గదర్శకాలను పరిశీలించి, ద్వారకాతిరుమల ఆలయానికి అనుగుణంగా స్పష్టమైన నిబంధనలు లేదా సూచనలు రూపొందించాలని భక్తులు కోరుతున్నారు.అదేవిధంగా, భక్తులకు ముందుగానే సమాచారం అందేలా ఆలయ ప్రవేశ మార్గాల్లో, పార్కింగ్ ప్రాంతాల్లో, క్యూ కాంప్లెక్స్‌ల వద్ద తెలుగు, ఇంగ్లిష్ భాషల్లో అవగాహన బోర్డులు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.భక్తుల విశ్వాసాలు, ఆలయ సంప్రదాయాలు, దేవస్థానం నిబంధనలను సమన్వయం చేస్తూ దేవస్థానం అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.




## కులమతాలకు అతీతంగా ఇందిరమ్మ పాలన:

- కులమతాలకు అతీతంగా ఇందిరమ్మ పాలన
- జనగామలో పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీ
- దసరా నాటికి 2.18 లక్షల ఇళ్లు పూర్తి
- బీఆర్ఎస్ పాలనలో కొద్దిమందికే ఇళ్లు ఇచ్చారని ఆరోపణ
- పేదల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోందని వెల్లడి

2లో

## పాలిచ్చే బర్రెను పక్కకు పెట్టి.. దున్నపోతును తెచ్చుకున్నారు:




2లో

- కేసీఆర్‌కు ఆదరణ తగ్గలేదన్న కేటీఆర్
- ప్రజల గుండెల్లో కేసీఆర్ ఉన్నారని వ్యాఖ్య
- ప్రతి మహిళ కేసీఆర్‌ను తలచుకుంటోందని వెల్లడి
- బీఆర్ఎస్ హయాంలో రైతుబంధు సమయానికి వచ్చేదని వ్యాఖ్య




## నవంబర్ రెండోవారంలో కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణ

**- మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి**

- 2027 వర్షాకాలానికి ముందే మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల పనులు పూర్తి
- అక్టోబర్ 5న సీడబ్ల్యూసీ సాంకేతిక పర్యవేక్షణ కమిటీ ముందుకు డిజైన్లు
- భద్రత, నాణ్యత విషయంలో రాజీపడే ప్రసక్తే లేదు
- జాతీయ సాంకేతిక సంస్థల సూచనల మేరకే పనులు



2లో

కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల సమగ్ర పునరుద్ధరణ పనులను నవంబర్ రెండోవారంలో ప్రారంభించి, 2027 వర్షాకాలానికి ముందే పూర్తి చేస్తామని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రకటించారు.

## ఖైరతాబాద్ ఉప ఎన్నికలో పోటీ చేస్తాం: కవిత



హైదరాబాద్: రేవంత్ రెడ్డి ప్రభుత్వం కేవలం మాటల ప్రభుత్వమేనని.. చేతలు శూన్యమని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే కేటీఆర్ ఫామ్‌హౌస్ పేరిట డ్రామాలు ఆడుతున్నారని మండిపడ్డారు. అంతా లోపాయికారీ ఒప్పందాలేనని.. ఫామ్‌హౌస్‌లపై చర్యలు ఉండవని ఎద్దేవా చేశారు. వచ్చే ఖైరతాబాద్ ఉప ఎన్నికలో తెలంగాణ రక్షణ సేన పోటీ చేస్తుందని కవిత ప్రకటించారు.

## ఇదే నా చివరి ప్రపంచకప్.. సర్వశక్తులూ ధారపోస్తా: కోహ్లీ



2లో

టీమ్ఇండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ కీలక వ్యాఖ్యలు చేశాడు. వచ్చే ఏడాది జరగబోయే వన్డే ప్రపంచ కప్.. దేశం తరపున తాను ఆడే చివరి మెగా టోర్నీ అని స్పష్టం చేశాడు. ఆ ట్రోఫీని కైవసం చేసుకునేందుకు మైదానంలో తన సర్వశక్తులూ ధారపోస్తానని తెలిపాడు.

# సంపాదకీయం

## భారత్‌కు వీటో హక్కు లభించేనా?

విదేశీ వ్యవహారాలలో మొదటి నుంచీ గాంధీజీ ఉపదేశించిన అహింస, శాంతి, సహకారం వంటి విలువల మార్గంలో పయనించే భారత్‌కు అంతర్జాతీయంగా ఎనలేని పలుకుబడి, ప్రతిష్ఠ ఉన్నాయి. విస్తృత ప్రపంచం పట్ల అనుకూల వైఖరితో వ్యవహరించడం, జాతీయ సార్వభౌమత్వాల ప్రాదేశిక సమగ్రతపై రాజీ లేని వైఖరి అవలంబించడం మన విదేశాంగ విధాన మౌలిక స్వభావం. దేశాన్ని పాలించేది ఎవరైనా, అధికారంలో ఉన్నది ఏ పార్టీ అయినా మన విదేశాంగ విధానాన్ని ఎప్పటికప్పుడు బలోపేతం చేయడం గర్వకారణం.

ఇటీవల న్యూఢిల్లీ వేదికగా భారత్ ఆతిథ్యం ఇచ్చిన బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో చైనా మొట్టమొదటిసారిగా భారత్‌కు అనుకూలంగా మాట్లాడి పాకిస్థాన్‌కు ఝలక్ ఇచ్చింది. కశ్మీర్‌లోని పహల్గావ్‌లో అమాయకులైన యాత్రికులపై పాకిస్థాన్ ముష్కరులు దాడిచేసి అమానుషంగా వారిని కాల్చి చంపిన ఉగ్రవాద చర్యను చైనా ఖండించడం భారత్ సాధించిన పాక్షిక దౌత్య విజయంగా చెప్పాలి. అంతేకాదు, బ్రిక్స్ న్యూఢిల్లీ సదస్సులో పాల్గొన్న ఇరాన్ తనపై యుద్ధం చేస్తున్న అమెరికా ప్రస్తావన తీసుకురాకుండా బ్రిక్స్ అజెండాకు పరిమితం కావడం కూడా భారత్ అవలంబించిన దౌత్యనీతిలో భాగమేనని చెప్పాలి.

ఆధునిక యుగ ప్రపంచ చరిత్రలో భారత జాతీయోద్యమానికి ఎంతో ప్రత్యేకత ఉంది. బ్రిటిషు వలస పాలకుల అణచివేత, హింస, దోపిడీలకు వ్యతిరేకంగా అహింసా మార్గంలో భారతీయులు చేసిన పోరాటం అంతర్జాతీయ సమాజానికి గొప్ప స్ఫూర్తినిచ్చింది స్వాతంత్ర్యం లభించిన తర్వాత మనం ఏర్పాటు చేసుకున్న సుదృఢమైన రాజ్యాంగం, దాని ద్వారా దేశ పౌరులకు సంక్రమించిన ప్రాథమిక హక్కులు, రాజ్యాంగబద్ధంగా పాలన చేసే ప్రజా ప్రభుత్వాల ఏర్పాటు.. తదితర ప్రజాస్వామ్య పరిణామాలన్నీ ప్రపంచాన్ని విస్తుపోయేలా చేశాయి. ముఖ్యంగా ప్రపంచ దేశాలు రెండుగా చీలి అటు అమెరికా, ఇటు రష్యాల శిబిరాల పక్కన చేరిన సందర్భంలో భారత్ తటస్థ వైఖరి అవలంబించి అలీనోద్యమానికి అంకురార్పణ చేసింది. నాటి పండిట్ నెహ్రూ నుంచి నేటి నరేంద్ర మోదీ వరకు మన విదేశాంగ విధానం మౌలికంగా ఎటువంటి మార్పు లేకుండా కొనసాగుతూ వస్తోంది. ఈ విశిష్టతే అంతర్జాతీయ సమాజంలో భారత్‌కు ఒక ప్రత్యేక ప్రాధాన్యాన్ని సమకూర్చుతోంది.

బ్రిక్స్ న్యూఢిల్లీ సదస్సులో సాధించిన పాక్షిక విజయంతోనే భారత్ సంతృప్తి చెందకూడదు. దౌత్యపరంగా ఇంకా అనేక సవాళ్లు దేశం ముందున్నాయి. పొరుగు పాకిస్థాన్ ఇంకా పక్కలో బల్లెంగానే ఉంది. అంతర్జాతీయ వాణిజ్యంలో వెనుకబడే ఉన్నాము. ఇవన్నీ దేశ సత్వర అభివృద్ధికి అవరోధమవుతున్నాయి. ముఖ్యంగా 1991లో పీవీ నరసింహారావు ప్రభుత్వం ఆనాటి దేశ ఆర్థిక పరిస్థితులను చక్కదిద్దే క్రమంలో జాతి ప్రయోజనాలకు దీర్ఘకాలంలో జరిగే నష్టాలను బేరీజు వేసుకోకుండా ప్రపంచీకరణ విధానాలను అనుసరించింది. అందులో భాగంగా చేసుకున్న అనేక అంతర్జాతీయ ఒప్పందాలు నేడు భారత్‌కు ప్రతికూలంగా పరిణమించాయి. ఎగుమతులు దిగుమతుల రంగంలో మన సొంత ఉత్పత్తిని పణంగా పెట్టి రాయితీలతో దిగుమతులు అనుమతించాము. దీనివల్ల వ్యవసాయంతో సహా పలు రంగాలు దెబ్బతిన్నాయి. దేశ జనాభాలో సగానికి పైగా ఆధారపడిన మన వ్యవసాయ రంగం విదేశీ సబ్సిడీ ఉత్పత్తుల పోటీని తట్టుకోలేకపోయింది. దేశీయ మార్కెట్లలో తమ ఉత్పత్తులకు సరైన మద్దతు ధర లభించక వ్యవసాయదారులు నష్టాల ఊబిలో కూరుకొని పోతున్నారు. మన రైతాంగానికి రక్షణ కల్పించేందుకు అమెరికాతో సహా వివిధ దేశాలతో కుదుర్చుకున్న వ్యవసాయ, వాణిజ్య ఒప్పందాలను ఇప్పటికైనా సమీక్షించాల్సిన అవసరం ఉంది. ఇందుకు దౌత్యపరమైన సంప్రదింపులే శరణ్యం. అలాగే తయారీ రంగంలో భారత్ అవకాశాలు కోల్పోయింది. ప్రపంచీకరణ వల్ల చైనా తన తయారీ రంగాన్ని ప్రపంచంలోనే అత్యున్నత స్థాయికి చేర్చి 'వరల్డ్ ఫ్యాక్టరీ'గా చేసుకోగలిగింది. పాక్షిక నైపుణ్యాలు కలిగిన కార్మికులకు ఉపాధి కల్పించగలిగే మన తయారీ రంగం దెబ్బ తినడంతో దేశంలో ఉపాధి లేమి ఏర్పడి ఆర్థిక అంతరాలు పెరిగిపోయాయి. ఆర్థిక వ్యవస్థల ప్రపంచీకరణతో ప్రపంచవ్యాప్తంగా అవకాశాలు రావడంతో వాటిని వెతుక్కుంటూ మన యువ విద్యార్థులు తరలిపోయారు. అంటే దేశీయ వనరులతో చదువుకున్న విద్యావంతుల ప్రతిభ ఇతర దేశాలకు ఉపయోగపడింది! మన విద్యావంతుల ప్రతిభను ఉపయోగించుకొని ఇక్కడే గ్లోబల్ బ్రాండ్లను సృష్టించే అవకాశాన్ని భారత్ కోల్పోయింది.

మరోవైపు బహుళ జాతి సంస్థలు సువిశాల భారతీయ విపణిలో ప్రవేశించడం వల్ల మన సంప్రదాయ కుటీర పరిశ్రమలు, చేనేత కార్మికులు, చిన్న వ్యాపారులు తీవ్రంగా నష్టపోయారు. చిన్న తరహా పరిశ్రమలు చాలా వరకు మూతపడ్డాయి. విద్య, వైద్య రంగాల ప్రైవేటీకరణతో పేద మధ్యతరగతి ప్రజలకు నాణ్యమైన విద్య, వైద్యం దూరమయ్యాయి. ఆర్థికాభివృద్ధి, సాంకేతిక పురోగతి సాధించినప్పటికీ స్వయం తప్పిదాల వల్ల భారత్ కొన్ని రంగాలలో వెనుకబడి ఉంది. ఈ అంశాలను ప్రధాని మోదీ, విదేశాంగ మంత్రి జైశంకర్ పదే పదే ప్రస్తావిస్తున్నారు. ఈ అనివార్య ప్రస్తావనలను నాటి పీవీ నరసింహారావు, ఆ తర్వాత డాక్టర్ మన్మోహన్ సింగ్ ప్రభుత్వాల వాణిజ్య విధానాలను విమర్శించడంగా చూడడం సబబు కాదు. వర్తమాన ప్రపంచ వాస్తవిక పరిస్థితులకు అనుగుణంగా వాటిని విశ్లేషించాల్సిన అవసరం ఉంది.

ప్రపంచీకరణ కొన్ని దేశాలకు వరంగా, మరికొన్ని దేశాలకు శాపంగా మారిన మాట నిజం. ప్రపంచీకరణ పేరుతో ప్రపంచ వాణిజ్య సంస్థతో భారత్ కుదుర్చుకున్న కొన్ని ఒప్పందాలు నేటికీ మన ఆర్థిక వ్యవస్థ పురోగతికి గుదిబండలుగా ఉన్నాయి. ఈ దృష్ట్యా, ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో 40 శాతం వాటా ఉన్న బ్రిక్స్ దేశాల నడుమ దృఢమైన ఆర్థిక, వ్యాపార, వాణిజ్య సంబంధాలు వర్ధిల్లితే మన దేశానికి చాలా మేలు జరుగుతుంది. ముఖ్యంగా బ్రిక్స్ భాగస్వామ్య దేశాలైన రష్యా, చైనాలతో పటిష్ఠ వాణిజ్య బంధాలను ఏర్పరచుకుంటే అమెరికా ఏకపక్షంగా విధిస్తున్న సుంకాల బెడదను తప్పించుకోవచ్చు. అయితే ఇదంత సులభమేమీ కాదు. ముఖ్యంగా భారత్ పట్ల చైనా నిలకడలేని వైఖరి ప్రదర్శిస్తోంది. భారత్ ఆర్థికంగా బలోపేతం కావడం చైనాకు ఇష్టం లేదన్నది బహిరంగ రహస్యమే. ఐక్యరాజ్యసమితి భద్రతామండలిలో భారత్‌కు శాశ్వత సభ్యత్వం లభించకుండా వీటో హక్కు గల చైనా ఎప్పటినుంచో అడ్డుకుంటోంది. భద్రతా మండలిలో సంస్కరణలు అత్యవసరమన్న భారత్ వాదనకు చైనా ఏ మాత్రం మద్దతు ఇవ్వడం లేదు. అంతర్జాతీయ వ్యవస్థను సమానత్వం వైపు నడిపించాలని బ్రిక్స్ సదస్సులో చైనా అధ్యక్షుడు షి జిన్‌పింగ్ పిలుపునిచ్చారు! ఇది, భారత్‌కు వ్యతిరేకంగా చైనా అనుసరిస్తున్న ద్వంద్వ నీతికి నిదర్శనం.

193 దేశాలకు సభ్యత్వమున్న వ్యవస్థగా ఐక్యరాజ్యసమితి ఉన్నప్పటికీ దానికి అనుబంధంగా ఉన్న భద్రతామండలిలో కేవలం ఐదు దేశాలకు మాత్రమే వీటో హక్కుతో కూడిన శాశ్వత సభ్యత్వం ఉంది. దీంతో భద్రతా మండలిలో ముఖ్యంగా ఆ రెండు దేశాల పెత్తనం నడుస్తోంది. ఆశ్చర్యం ఏమిటంటే, ఆఫ్రికా, లాటిన్ అమెరికా ఖండాల నుంచి ఒక్క దేశానికి కూడా భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం లేదు. ఈ ఖండాల దేశాలకూ మండలిలో సముచిత రీతిలో ప్రాతినిధ్యం ఉండాలని భారత్ సహా పలు దేశాలు పదేపదే చేస్తున్న విజ్ఞప్తులు కంఠశోషగానే మిగిలిపోతున్నాయి. భద్రతామండలిలో ఎక్కువ దేశాలకు శాశ్వత ప్రాతినిధ్యం కల్పిస్తే నిర్ణయాలు తీసుకోవడంలో తీవ్ర జాప్యం జరుగుతుందనే సాకుతో అటువంటి ప్రతిపాదనలను బుట్ట దాఖలు చేస్తున్నారు. ముఖ్యంగా ఏకపక్ష సుంకాల విధింపునకు ప్రపంచ వాణిజ్య సంస్థ నిబంధనలను తోసిరాజని సొంత నిర్ణయాలను కొన్ని దేశాలు అమలు చేస్తున్నాయని అమెరికా పేరును నేరుగా ప్రస్తావించకుండానే ప్రధాని మోదీ బ్రిక్స్ సదస్సులో తప్పు పట్టడం గమనార్హం. ఐక్యరాజ్యసమితిలో ప్రతి ఒక్కరికి సమాన భాగస్వామ్యం ఉండాలి. భద్రతా మండలి విస్తరణ వాయిదా పడకూడదని మోదీ విస్పష్టంగా చెప్పారు. భారత్ ప్రతిపాదనలను అమలు పరచడానికి 10 సూత్రాలతో ఒక మార్గదర్శక ప్రణాళికను వచ్చే బ్రిక్స్ సమావేశాల నాటికి ఉమ్మడిగా రూపొందించాలని కూడా ఆయన దిశానిర్దేశం చేశారు. బ్రిక్స్ వేదికపై భారత ప్రధానమంత్రి ఇంత స్పష్టంగా అభివృద్ధి చెందుతున్న దేశాల హక్కులు, ప్రయోజనాల గురించి మాట్లాడటం

## సైబర్ ముప్పులపై అప్రమత్తత అవసరం:

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: ఏఐ, క్వాంటమ్ కంప్యూటింగ్ వంటి ఆధునిక సాంకేతికతలతో పాటు పెరుగుతున్న సైబర్ ముప్పులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ ఎం.రమేశ్ అన్నారు. 'ఐసాకా హైదరాబాద్ చాప్టర్' 26వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన 'ఫ్యూజన్-2026' వార్షిక సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఏఐ, క్వాంటమ్ కంప్యూటింగ్, డేటా రక్షణ, సైబర్ సెక్యూరిటీ, రిస్క్ తదితర అంశాలపై చర్చించారు. డేటా రక్షణ, సైబర్ రిస్క్, డిజిటల్ మోసాల నివారణకు సంస్థలు, నిపుణులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. డీప్‌ఫేక్ వీడియోలు, ఓటీపీ ఆధారిత లావాదేవీల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐసాకా హైదరాబాద్ చాప్టర్ అధ్యక్షుడు సుజయ్ గంకిడి, ఉపాధ్యక్షుడు రాజ్ పవార్, సైబర్ సెక్యూరిటీ, ఆడిట్, రిస్క్ రంగాలకు చెందిన నిపుణులు, పరిశ్రమ ప్రతినిధులు, సాంకేతిక నిపుణులు పాల్గొన్నారు.

## నవంబర్ రెండోవారంలో కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణ

మొదటిపేజీ తరువాయి

మూడు బ్యారేజీల భద్రతను పటిష్ఠం చేయడంతోపాటు వాటి నిర్వహణ సామర్థ్యాన్ని పూర్తిస్థాయిలో పునరుద్ధరించేందుకు అవసరమైన డిజైన్లను రాష్ట్ర ప్రభుత్వం ఖరారు చేసిందని తెలిపారు. హైదరాబాద్ బేగంపేట లోకి కుందన్ బాగ్ లో ఉన్న తన అధికారిక క్యాంపు కార్యాలయంలో శనివారం నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు, ఇంజినీర్లతో బ్యారేజీల పునరుద్ధరణ ప్రతిపాదనలపై మంత్రి సమీక్ష నిర్వహించారు.

ప్రాజెక్టు డిజైనర్ రూపొందించిన పునరుద్ధరణ ప్రణాళికలో గ్రౌటింగ్ ద్వారా పునాదులను బలోపేతం చేయడం, స్టిల్లింగ్ బేసిన్లను పొడిగించడం, కొత్తగా కట్-ఆఫ్ వాల్స్ నిర్మించడం వంటి కీలక పనులు ఉన్నాయని మంత్రి తెలిపారు. వరద ప్రవాహ వేగాన్ని నియంత్రించే ఏర్పాట్లలో ఉన్న లోపాలను సరిచేయడంతోపాటు పునాదుల స్థిరత్వాన్ని పెంచడం, పునాదుల కింద నీటి చొరబాటును అరికట్టడం ఈ పనుల ప్రధాన ఉద్దేశమని వివరించారు. జాతీయ ఆనకట్టల భద్రతా సంస్థ (ఎన్‌డీఎస్‌ఏ)తోపాటు ఇతర నిపుణుల కమిటీలు వ్యక్తం చేసిన అభ్యంతరాలు, సూచనలను పరిగణనలోకి తీసుకొని పునరుద్ధరణ ప్రణాళికను రూపొందించినట్లు మంత్రి వెల్లడించారు. "బ్యారేజీల నిర్మాణ భద్రత, పునరుద్ధరణ పనుల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండదు. శాస్త్రీయ అధ్యయనాలు, జాతీయ స్థాయి సాంకేతిక సంస్థల సిఫార్సుల ఆధారంగానే ప్రతి పని జరుగుతుంది" అని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. ప్రతిపాదిత డిజైన్లను పుణేలోని కేంద్ర జల, విద్యుత్ పరిశోధనా కేంద్రం (సీడబ్ల్యూపీఆర్‌ఎస్)లో కంప్యూటేషనల్ ఫ్లూయిడ్ డైనమిక్స్ నమూనాల ద్వారా పరీక్షిస్తున్నట్లు తెలిపారు. వివిధ స్థాయిల్లో వరద ప్రవాహం ఉన్నప్పుడు బ్యారేజీల వద్ద నీటి ప్రవాహ తీరు ఎలా ఉంటుందో, ప్రతిపాదించిన చర్యలు ఎంత సమర్థంగా పనిచేస్తాయో ఈ పరీక్షల ద్వారా నిర్ధారిస్తారని చెప్పారు. ఖరారు చేసిన డిజైన్లను అక్టోబర్ 5న న్యూఢిల్లీలో కేంద్ర జల సంఘం ఆధ్వర్యంలోని సాంకేతిక పర్యవేక్షణ కమిటీ ముందు ఉంచనున్నట్లు మంత్రి వెల్లడించారు.

కమిటీ నిపుణులు వాటిని పరిశీలించి అవసరమైన సూచనలు, సిఫార్సులు చేస్తారని తెలిపారు.

సాంకేతిక అనుమతులు వచ్చిన వెంటనే పనులు ప్రారంభించేందుకు అవసరమైన అన్ని ముందస్తు ఏర్పాట్లను ఏకకాలంలో పూర్తి చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. పునరుద్ధరణ పనులకు సంబంధించిన సమగ్ర వ్యయ అంచనాలను నీటిపారుదల, ఆయకట్టు అభివృద్ధి శాఖ సిద్ధం చేస్తోందని చెప్పారు. ప్రభుత్వ అనుమతి కోసం అవసరమైన కాంట్రాక్టు విధానాన్ని కూడా ఖరారు చేస్తున్నట్లు తెలిపారు. డిజైన్లకు అనుమతి లభించిన వెంటనే టెండర్లను పిలిచి, పనులను అప్పగించేలా మొత్తం ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. పనుల అమలులో కఠినమైన నాణ్యతా ప్రమాణాలు, స్వతంత్ర పరీక్షలు, స్పష్టమైన కాలపరిమితులు ఉండాలని ఆదేశించారు. నిర్ణీత గడువులో పనులు పూర్తయ్యేలా ఉన్నతాధికారులు నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. తాత్కాలిక మరమ్మతులతో సరిపెట్టకుండా, సాంకేతికంగా పటిష్ఠమైన, దీర్ఘకాలం మన్నే విధానాలతో మూడు బ్యారేజీలను పునరుద్ధరించడమే ప్రభుత్వ లక్ష్యమని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. "పునరుద్ధరణ పనులు పూర్తయి, జాతీయ సాంకేతిక సంస్థల నుంచి అవసరమైన భద్రతా అనుమతులు వచ్చిన తర్వాతే మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను తిరిగి నిర్వహణలోకి తీసుకొస్తాం" అని మంత్రి తేల్చిచెప్పారు.

డిజైన్ల పరిశీలన నుంచి టెండర్లు, పనుల అమలు, తుది భద్రతా ధ్రువీకరణ వరకు ప్రతి దశను పక్కాగా నమోదు చేయాలని ఆదేశించారు. ఎన్‌డీఎస్‌ఏ ఆదేశాలను పూర్తిస్థాయిలో పాటిస్తూ, ప్రతి దశను నిపుణుల పరిశీలనకు లోబడి నిర్వహించాలని అధికారులకు సూచించారు.

ఈ సమీక్షలో నీటిపారుదల, ఆయకట్టు అభివృద్ధి శాఖ ఉన్నతాధికారులు, కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణ కార్యక్రమంతో సంబంధం ఉన్న ఇంజినీర్లు పాల్గొన్నారు.

## ఇదే నా చివరి ప్రపంచకప్.. సర్వశక్తులూ ధారపోస్తా: కోహ్లి

మొదటిపేజీ తరువాయి

ఈ నెల 27 నుంచి వెస్టిండీస్‌తో ప్రారంభం కానున్న మూడు వన్డేల సిరీస్‌కు (×అఎఱఖు ఎం ఔవర్‌ఱఅఎఅవం) ముందు 'జియోస్టార్'తో కోహ్లి మాట్లాడాడు. వచ్చే ఏడాది సౌతాఫ్రికా, జింబాబ్వే, నమీబియాలు సంయుక్తంగా వన్డే ప్రపంచకప్‌నకు ఆతిథ్యం ఇవ్వనున్నాయి.

మళ్లీ బ్యాట్లు పట్టిన రో-కో

"భారత్ తరఫున ఆడబోయే చివరి వరల్డ్‌కప్ ఇదే. టోర్నీని గెలవడమే నా ఏకైక లక్ష్యం. దాని కోసం ఎంత దూరమైనా వెళ్లేందుకు, మైదానంలో సర్వస్వం ధారపోసేందుకు సిద్ధంగా ఉన్నా" అని కోహ్లి వెల్లడించాడు. వన్డే ప్రపంచకప్‌లో ఉండే ఇంటెన్సిటీ మరే ఇతర టోర్నమెంట్‌లోనూ ఉండదని చెప్పాడు. "ఇందులో దాదాపు 10 మ్యాచ్‌లను టీ20 స్థాయి తీవ్రతతో ఆడాల్సి ఉంటుంది. ఒక వన్డే మ్యాచ్ అనేది 2.5 టీ20లతో సమానం. పెద్ద టోర్నమెంట్ లేదా ప్రపంచకప్‌లో వరుసగా 10 మ్యాచ్‌లపాటు ఆ ఇంటెన్సిటీని కొనసాగించడం చాలా పెద్ద విషయం." అని తెలిపాడు.

అదే అసలైన సవాలు: రోహిత్ శర్మ

మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ మాట్లాడుతూ.. "నేను చేయాల్సిన పని పూర్తయిందనే ఆలోచన ఎప్పుడూ రాదు. ఆడుతున్నంత కాలం.. ఏదో ఒక లక్ష్యం కోసం ఎదురుచూస్తూనే ఉంటాం. ప్రస్తుతం ప్రపంచకప్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను. ప్రపంచకప్ లేదా ఏదైనా ఐసీసీ టోర్నమెంట్ ఆడేటప్పుడు వేర్వేరు వేదికలపై.. వేర్వేరు ప్రత్యర్థులను ఎదుర్కొంటాం. కాబట్టి, అందుకు తగినట్లు విభిన్నంగా సిద్ధం కావాలి. కొత్తగా ఆలోచించాలి. అదే అసలైన సవాలు" అని పేర్కొన్నాడు. రాబోయే వన్డే వరల్డ్‌కప్ వరకు ఆడతారా? లేదా? అనే సందేహాలకు ఈ ఇద్దరు తమ వ్యాఖ్యలతో తాజాగా చెక్‌పెట్టినట్లయ్యింది.

## మద్యం షాపులకు అక్టోబరు 5న డ్రా: మంత్రి కొల్లు రవీంద్ర

మొదటిపేజీ తరువాయి

ఎలాంటి అక్రమాలకు తావు లేకుండా.. డిస్టలరీల నుంచి మద్యం షాపు వరకు పూర్తి స్థాయిలో పర్యవేక్షణ ఉంటుందన్నారు. "ఎక్సైజ్ సురక్షా యాప్ ద్వారా మద్యం బాటిల్‌ను స్కాన్ చేసి పూర్తి వివరాలు తెలుసుకోవచ్చు. కొందరు వ్యక్తులు కల్తీ మద్యం తయారు చేసి ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకురావాలని చూస్తే కఠిన చర్యలు తీసుకున్నాం. వైకాపా హయాంలో మద్యం పాలసీ పూర్తిగా అవినీతిమయం చేశారు. మద్యం రవాణాలో కూడా అక్రమాలకు పాల్పడి రూ.కోట్లు దోచుకున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత 80శాతం కొత్త బ్రాండ్‌లు తీసుకొచ్చాం. ఆల్కహాల్ తక్కువగా ఉండే మద్యాన్ని ప్రమోట్ చేయాలని సీఎం సూచించారు. దానిపై ప్రత్యేక దృష్టి సారించాం" అని కొల్లు రవీంద్ర తెలిపారు.

## 'సర్' నోటీసులు..

### అత్యవసరమైతే తప్ప వ్యక్తిగత విచారణకు రానక్కర్లేదు: ఈసీ

మొదటిపేజీ తరువాయి

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ పై కేంద్ర ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. సర్ నోటీసులు అందుకున్న ఓటర్లు.. అత్యవసరమైన సందర్భాల్లో తప్ప వ్యక్తిగత విచారణకు హాజరు కావాల్సిన అవసరం లేదని తెలిపింది. 'సర్' కోసం ఫారం-6కు జతచేసిన డిక్లరేషన్‌ను సుప్రీంకోర్టు సమర్థించిందని పేర్కొంది. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ ఎన్నికల కమిషనర్లు డా.సుఖ్‌బీర్ సింగ్ సంధూ, డా.వివేక్ జోషి నేడు దిల్లీలోని ఈసీ ప్రధాన కార్యాలయంలో భేటీ అయ్యారు. 'సర్'పై భిన్నాభిప్రాయాల అంశం తీవ్ర దుమారం రేపిన వేళ.. ఈ భేటీ కీలక ప్రాధాన్యం సంతరించుకుంది.

కేంద్ర క్యాబినెట్ కార్యదర్శికి ఎన్నికల కమిషనర్లు రాసిన లేఖ.. ఈసీ లేదా ఐటీ విభాగాల విధానపరమైన అంశానికి సంబంధించినది కాదని, ఈసీకి డిప్యుటేషన్‌పై వచ్చిన ఓ అధికారి పనితీరుకు సంబంధించిందని ఎన్నికల సంఘం (జుశ్రీవఓ్‌ఱశీఅ జశీఎఎఱంంఱశీఅ) వివరించింది. సీఈసీ, ఎన్నికల కమిషనర్ల సమావేశం అనంతరం ఈమేరకు ఓ ప్రకటన విడుదల చేసింది.

"బిహార్, పశ్చిమ బెంగాల్ సహా 20 రాష్ట్రాలు/ కేంద్రపాలిత ప్రాంతాల్లో 'సర్' ప్రక్రియ ఇప్పటికే పూర్తయింది. తమ పేర్లు నమోదు కాకుండా మిగిలిపోయిన వారు, యువకులు, మొదటిసారి ఓటు వేసేవారు.. నిరంతర అప్‌డేషన్ ప్రక్రియ ద్వారా ఓటు హక్కు కోసం సంబంధిత ఈఆర్‌వోకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ మేరకు ఏర్పాట్లు చేయాలని సీఈవోలకు ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ ఓటర్ల నమోదుకు ఎన్నికల అధికారులు తక్షణమే స్పెషల్ డ్రైవ్ ప్రారంభించనున్నారు.

దేశవ్యాప్తంగా 'సర్' నిర్వహణ సహా ఈ మధ్య కాలంలో ఈసీ అనేక నిర్ణయాలు తీసుకుంది. బిహార్ నుంచి మొదలు అన్ని రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల్లో సర్ ప్రక్రియ కోసం గతేడాది జూన్ 24నాటి ఆదేశాలు ఎన్నికల కమిషన్ ఏకగ్రీవ ఆమోదంతోనే జారీ అయ్యాయి. దీన్ని సర్వోన్నత న్యాయస్థానం కూడా సమర్థించింది" అని ఈసీ తెలిపింది.

గోవాలో 97 మంది అర్హులకు తుది ఓటర్ల జాబితాలో చోటుదక్కకపోవడంపై స్పందిస్తూ.. "ఓటర్ల జాబితాలో పేరు లేని అర్హుల నుంచి దరఖాస్తులు సేకరణకు ఇంటింటికీ వెళ్లాలని సంబంధిత బూత్ స్థాయి అధికారులను గోవా సీఈవో ఆదేశించారు. ఆ 97 మంది ఓటర్లలో ఇప్పటికే 81 మంది 'ఫారం-6' నింపారు" అని వెల్లడించింది.

కార్యక్రమ వేదికకు వెళ్లే మార్గాన్ని సైతం తమ ఆధీనంలోకి తీసుకొని.. కార్యకర్తలపై బెదిరింపులకు పాల్పడుతున్నారని తెలిపారు. ఇంత జరుగుతున్నా పోలీసులు తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. నిజంగా ధైర్యముంటే తమ నేతలను కాకుండా తనను అడ్డుకోవాలని దీదీ భాజపాకు సవాల్ విసిరారు.

'మా నేతలు కొందరిని గృహ నిర్బంధంలో ఉంచారు. ర్యాలీ జరిగే ప్రదేశానికి వెళ్లనివ్వడం లేదు. కోర్టు అనుమతితోనే ర్యాలా నిర్వహిస్తున్నాం. ఇది సజావుగా సాగేలా చూడడం పోలీసులు, అధికార యంత్రాంగం బాధ్యత. కానీ వారు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. ప్రజాస్వామ్యదేశమైన భారత్‌లో ఇటువంటి దాడులు జరగడం సిగ్గుచేటు. ర్యాలీకి వెళ్లకుండా చేయడానికి ఎన్ని అడ్డంకులు సృష్టించినా ఆగేదీ లేదు. సభకు వెళ్లి ప్రసంగిస్తాను. సాధ్యమైతే నన్ను ఆపండి' అని మమత పేర్కొన్నారు.

సీఈసీ వివాదం.. 30న 'ఇండియా కూటమి' నేతల భేటీ

కునాల్ ఘోష్ కారుపై గుడ్లు..రాళ్ల దాడి..

మమతా బెనర్జీ ర్యాలీకి వెళ్తున్న ఆమె వర్గం ఎమ్మెల్యే కునాల్ ఘోష్ ను కొందరు దుండగులు హూగ్లీ జిల్లాలో అడ్డుకున్నారు. నల్ల జెండాలు పట్టుకున్న కొందరు ఆయన కారుపై రాళ్లు, కోడిగుడ్లతో దాడి చేశారు. దీంతో ముందుకు వెళ్లడానికి అవకాశం లేక ఆయన వెనుదిరగాల్సి వచ్చింది. ఈ ఘటనలో కారు అద్దాలు పగిలిపోయినట్లు తెలుస్తోంది.

## కులమతాలకు అతీతంగా ఇందిరమ్మ పాలన:

మొదటిపేజీ తరువాయి

జనగామ: రాష్ట్రంలో కులమతాలకు అతీతంగా ఇందిరమ్మ పాలన సాగుతోందని తెలంగాణ గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జనగామలో ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి.. అర్హులైన పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. దసరా నాటికి 2,18,000 ఇళ్లు పూర్తవుతాయన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో కేవలం కొన్ని నియోజకవర్గాలకే ఇళ్లు ఇచ్చారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం పేదల కోసం పని చేస్తుందని, గత ప్రభుత్వం తీసుకొచ్చిన పథకాలను కూడా కొనసాగిస్తున్నామని శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు.

## పాలిచ్చే బర్రెను పక్కకు పెట్టి.. దున్నపోతును తెచ్చుకున్నారు:

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: పాలిచ్చే బర్రెను పక్కకు పెట్టి.. ప్రజలు తన్నే దున్నపోతును తెచ్చుకున్నారని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ వ్యాఖ్యానించారు. పని చేస్తున్న ప్రభుత్వం కాళ్లల్లో కట్టెలు పెట్టొద్దనే కేసీఆర్ బయటికి రావట్లేదని తెలిపారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మూడేళ్లు కేసీఆర్ బయటకు రాకపోయినా ఆదరణ తగ్గలేదన్నారు. ఆయన బయటకి కనిపించకపోయినా.. ప్రజల గుండెల్లో భద్రంగా ఉన్నారన్నారు. ప్రతి మహిళ, ప్రతి ఆడబిడ్డ ఇవాళ కేసీఆర్‌ను తలచుకుంటున్నారని చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు సమయానికి రైతుబంధు పడేదని గుర్తు చేస్తూ.. ఈ ప్రభుత్వం ఇప్పటికే మూడుసార్లు రైతుభరోసా ఎగ్గొట్టిందన్నారు.

## మన్మోహన్‌సింగ్ జీవితం జెన్‌జీ సహా.. అన్ని తరాలకు స్ఫూర్తి: సీఎం రేవంత్



హైదరాబాద్: మౌనమే భాషగా మార్చుకొని అద్భుతమైన పరిపాలన అందించిన గొప్ప రాజనీతిజ్ఞుడు డాక్టర్ మన్మోహన్ సింగ్ అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఫైనాన్షియల్ డిస్ట్రిక్ విప్రో సర్కిల్‌లో ఏర్పాటు చేసిన మన్మోహన్ విగ్రహాన్ని సీఎం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు.

"దేశం రాజకీయ సంక్షోభంలో ఉన్నప్పుడు మన్మోహన్‌సింగ్ పగ్గాలు చేపట్టారు. భూగరిష్ఠ పరిమితి చట్టాలు చేయడంలో ఆనాడు భూమి ఉన్నవాళ్లే కీలకపాత్ర పోషించారు. ఆ లోపాన్ని సరిదిద్దేలా మన్మోహన్ సింగ్ ప్రభుత్వం భూ సేకరణ చట్టాన్ని చేసింది. ప్రభుత్వం భూ సేకరణ చేస్తే నిర్వాసితుల ఆమోదం తప్పనిసరి చేశారు. అలాంటి గొప్ప నేతకు భారతరత్న ఇవ్వకపోవడం శోచనీయం. మన్మోహన్‌సింగ్‌కు భారతరత్న ఇచ్చేందుకు కేంద్రానికి ఉన్న అభ్యంతరం ఏమిటి? పార్టీలకు అతీతంగా మేధావులను గౌరవిస్తేనే.. మనకు విజ్ఞత ఉన్నట్టు. మన్మోహన్‌కు భారతరత్న ఇవ్వాలని ప్రధాని మోదీకి విజ్ఞప్తి చేస్తున్నా. ఆయన జీవితం జెన్‌జీ సహా అన్ని తరాలకు ఒక స్ఫూర్తి. మన్మోహన్ సింగ్, పీవీ నర్సింహారావు ఆలోచనల ఫలితమే.. సరళీకృత ఆర్థిక విధానం. ఆనాడు ఇద్దరూ కలిసి తీసుకున్న నిర్ణయాలే ఇవాళ దేశాన్ని పటిష్ఠంగా నిలబెట్టాయి. వారిద్దరి నిర్ణయాల వల్లే ఇలాంటి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లు ఏర్పడ్డాయి" అని సీఎం అన్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత సీజేఐ జస్టిస్ ఎన్వీ రమణ, రాష్ట్ర మంత్రులు శ్రీధర్‌బాబు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పట్టణ లాండ్రీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో

# ఘనంగా చాకలి ఐలమ్మ 131 జయంతి వేడుకలు

**జనసముద్రం న్యూస్ సెప్టెంబర్ 27 సూర్యాపేట జిల్లా హుజూర్నగర్ నియోజకవర్గ రిపోర్టర్ అలవాల రవి.**

తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు వీరనారి చాకలి ఐలమ్మ గారి 131 జయంతి వేడుకలు పట్టణంలోని లాండ్రీ షాప్ యూనియన్ అధ్యక్షులు ఇందిరాల నరసయ్య ఆధ్వర్యంలో స్థానిక పాత బస్టాండ్ సెంటర్ అమరవీరుల స్థూపం వద్ద ఘనంగా నిర్వహించబడినది ఈ సందర్భంగా ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన పట్టణ రజక సంఘం అధ్యక్షులు ఇందిరాల వెంకటేశ్వర్లు పట్టణ రజక సంఘం గౌర అధ్యక్షులు రేపాకుల కోటయ్య వారు మాట్లాడుతూ భూమి కోసం భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాడిన తెలంగాణ ప్రజల తెగువ తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తిని ప్రపంచానికి చాటి చెప్పిన మన చాకలి ఐలమ్మ అని తన పండించిన పంటను రక్షించుకోవడానికి అప్పటి భూస్వాములు దేశ్ ముక్కుల





పటేళ్లు దొరలకు వ్యతిరేకంగా పోరాడిన అని ఆమె పోరాట స్ఫూర్తిని నేటి తరానికి మహిళలు ఆదర్శంగా తీసుకోవాలని ఆమెను ఒక రజక కులానికి మాత్రమే కాకుండా అన్ని కులాల వర్గాలు తెలంగాణ తల్లి చాకలి ఐలమ్మ జయంతి వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించాలని కోరినారు అదే విధంగా చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ట్యాంకుబండపై ప్రతిష్ఠించాలని అప్పుడే ఈ తెలంగాణ ప్రభుత్వం ఆమెకు ఘనమైన నివాళులు అర్పించాలన్నట్టుగా భావిస్తామని జనగామ జిల్లాకు ఆమె పేరును పెట్టాలని పాలకుర్తిలో ఆమె పేరిట ఒక స్మృతి వనం ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు అనంతరం కేక్ కట్ చేసి మిఠాయిలు కేకు స్థానిక ప్రజలకు పంచి పెట్టినారు ఈ కార్యక్రమంలో దుగ్గి బ్రహ్మం రేపాకుల మురళి దుగ్గి సాయిబాబా పద్నానపు శ్రీనివాస్ ఇందిరాల రాంబాబు అలవాల ఉపేందర్ అలవాల అంజి దుగ్గి నరసింహ వడ్లానపు నరసింహారావు చిలక రాజు సైదులు ఇందిరాల నరేష్ చిక్కుళ్ళ తిరుపతి పెద్దారపు వీరయ్య రేపాకుల గురుమూర్తి అలవాల శివ నరసింహారావు రమేష్ శ్రీను కృష్ణ తదితరులు పాల్గొన్నారు

# బహుజనుల ఆత్మగౌరవానికి ప్రతీక చాకలి ఐలమ్మ

**•చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తితో మళ్లీ తెలంగాణలో భూమి హక్కుల కోసం పోరాటం చేస్తాం: దావ వసంత సురేష్**

**(జనసముద్రం న్యూస్)జగిత్యాల జిల్లా బ్యూరో**

మోరపల్లి: చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా జగిత్యాల రూరల్ మండలం మోరపల్లి గ్రామంలోని చాకలి ఐలమ్మ విగ్రహానికి జగిత్యాల జిల్లా తొలి జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. రజక సంఘ నాయకులు, మహిళలు, గ్రామస్తులు, బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా దావ వసంత సురేష్ మాట్లాడుతూ.. చాకలి ఐలమ్మను కేవలం రజక సామాజిక వర్గానికే పరిమితం చేయకుండా, బహుజనుల ఆత్మగౌరవం, అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాడిన గొప్ప నాయకురాలిగా ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని అన్నారు. నిజాం పాలనకు వ్యతిరేకంగా, భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరీ నుంచి విముక్తి కోసం ఆమె చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.

చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తితోనే కేసీఆర్ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమించారని అన్నారు. బట్టలకు పట్టిన మురికిని తొలగించడమే కాకుండా, సమాజానికి పట్టిన మురికిని తొలగించే బాధ్యతను రజకులు నిర్వర్తిస్తున్నారని



తెలిపారు.

రజకుల సంక్షేమం కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో దోబీఘాట్ల ఏర్పాటు, 250 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ వంటి పలు చర్యలు చేపట్టిన విషయాన్ని గుర్తు చేశారు.

ప్రస్తుతం రాష్ట్రంలో భూముల విషయంలో పేద ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తమ భూములు తమకు



తెలియకుండానే 22ఏ నిషేధిత జాబితాలో చేర్చినట్లు ఆరోపించారు. ఆనాడు చాకలి ఐలమ్మ భూమి కోసం పోరాటం చేస్తే, నేడు తెలంగాణలో భూమి హక్కుల కోసం మళ్లీ పోరాటం చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు.

చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తితో పేద ప్రజల భూమి హక్కుల కోసం పోరాటం చేస్తామని దావ వసంత సురేష్ పేర్కొన్నారు. తెలంగాణలోని సబ్బండ వర్గాలకు కేసీఆర్ అండగా నిలిచారని అన్నారు.

ఈ కార్యక్రమంలో జగిత్యాల పాక్స్ చైర్మన్ పత్తిరెడ్డి మహిపాల్ రెడ్డి, సర్పంచ్ కట్ట రాజేందర్ ,ఉప సర్పంచ్ గంగరాజం, వార్డు సభ్యులు రోజా, విజయ్, నాయకులు లింగారెడ్డి, గంగారావు, గంగారెడ్డి, అబ్దుల్ అర్షిత్ రావు, రామ్మోహన్ రెడ్డి, రజక సంఘం నాయకులు లింగన్న, ప్రశాంత్, నారాయణ, గంగన్న, తిరుపతి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# బ్రహ్మణగౌరారం గ్రామంలో రీ-సర్వే గ్రామసభ

**జన సముద్రం న్యూస్ । నల్లగొండ । నాంపల్లి । సెప్టెంబర్ 26:**

నాంపల్లి మండలంలోని బ్రహ్మణగౌరారం గ్రామంలో రీ-సర్వే ప్రక్రియకు సంబంధించి గ్రామసభను నిర్వహించారు నెమిళ్లగూడ గ్రామపంచాయతీ పరిధిలో నిర్వహించిన ఈ గ్రామసభకు రెవెన్యూ, సర్వే మరియు భూ రికార్డుల శాఖకు చెందిన అధికారులు ప్రజాప్రతినిధులు సర్పంచ్‌తో పాటు గ్రామస్థులు హాజరయ్యారు ఈ సందర్భంగా గ్రామంలో చేపట్టనున్న రీ-సర్వే ప్రక్రియకు సంబంధించిన అంశాలను అధికారులు గ్రామస్థులకు వివరించారు భూముల హద్దులు సర్వే వివరాలు భూ రికార్డుల పరిశీలన తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు రీ-సర్వే ద్వారా భూములకు సంబంధించిన వివరాలను క్షేత్రస్థాయిలో



పరిశీలించి రికార్డులను మరింత స్పష్టంగా నమోదు చేయనున్నట్లు అధికారులు వివరించారు గ్రామస్థులు తమ భూములకు సంబంధించిన సమస్యలు హద్దులు రికార్డుల్లో ఉన్న వివరాలపై అధికారుల దృష్టికి తీసుకువచ్చారు ప్రజల నుంచి వచ్చిన అభిప్రాయాలు సూచనలు సమస్యలను అధికారులు నమోదు చేసుకున్నారు రీ-సర్వే ప్రక్రియలో గ్రామస్థులు అధికారులకు సహకరించాలని సూచించారు ఈ గ్రామసభలో ఆర్డీవో అదనపు సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారులు సంబంధిత రెవెన్యూ సిబ్బంది సర్పంచ్ ప్రజాప్రతినిధులు గ్రామ పెద్దలు రైతులు గ్రామస్థులు పాల్గొన్నారు గ్రామంలో భూ సంబంధిత వివరాల సర్వే ప్రక్రియ సజావుగా కొనసాగేందుకు ప్రజలు సహకరించాలని అధికారులు కోరారు

## సమిష్టి కృషితో జిల్లాలో ప్రశాంతంగా ముగిసిన గణేష్ నిమజ్జనం: జిల్లా ఎస్పి శ్రీ అశోక్ కుమార్ ఐపిఎస్

**- - క్షేత్ర స్థాయిలో కష్టపడి విధులు నిర్వర్తించిన అదికారులు, సిబ్బందిని అభినందించిన ఎస్పీ గారు.**

**( జన సముద్రం న్యూస్)జగిత్యాల జిల్లా**

ఈ నెల 14వ తేదీన ప్రారంభమైన గణేష్ నవరాత్రి ఉత్సవాలు జిల్లాలో ప్రశాంతంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సమిష్టి కృషితో నిమజ్జనాన్ని ప్రక్రియ పూర్తి చేయడం జరిగింది అని జిల్లా ఎస్పీ శ్రీ అశోక్ కుమార్ ఐపిఎస్ గారు తెలిపారు. జిల్లాలో 3500 పైగా గణేష్ మండపాల నుండి విగ్రహాలు శాంతియుత వాతావరణంలో నిమజ్జనం చేయబడ్డాయిని నిమజ్జన ప్రాంతాల్లో పోలీసులు, రెవెన్యూ, మున్సిపల్, అగ్నిమాపక,



ఆరోగ్యశాఖలు సిబ్బంది సహకారంతో సమన్వయంగా పనిచేయడం వల్ల ఎటువంటి ఇబ్బందులు తలెత్తలేదని ఎస్పీ గారు అన్నారు. గడిచిన 11 రోజులపాటు 24 గంటలు పని చేసిన పోలీస్ అధికారులు, క్షేత్రస్థాయిలో పనిచేసే సిబ్బంది యొక్క కృషి వల్లనే గణేష్ ఉత్సవాలను విజయవంతంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిర్వహించుకున్నామని దీనికి కృషి చేసిన పోలీస్ అధికారులను, సిబ్బందిని జిల్లా ఎస్పీ గారు అభినందించారు. అదేవిధంగా నిమజ్జనం జరిగే ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రణలో ట్రాన్స్‌జెండర్స్, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు సక్రమంగా విధులు నిర్వర్తించి తమ వంతు పాత్ర పూర్తి చేసినందుకు అభినందనలు తెలియజేశారు.జిల్లా ప్రజలు, మండపాల నిర్వాహకుల సహకారం వల్ల గణేష్ ఉత్సవాలు,నిమజ్జనం ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండ సాఫీగా ముగిసిందని ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు, మండపాల నిర్వాహకులకు ఎస్పీ గారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తూ రాబోవు రోజుల్లో జరిగే పండుగలను ఇదే స్ఫూర్తితో జరుపుకోవాలని కోరారు.

# ఐలమ్మ పోరాట స్ఫూర్తిని కొనసాగిద్దాం..

**•ఆనంద్‌బాగ్‌లో ఘనంగా వీరనారి ఐలమ్మ జయంతి**

**మల్కాజిగిరి,26 సెప్టెంబర్ (జన సముద్రం న్యూస్):**

వీరనారి చాకలి ఐలమ్మ 131వ జయంతి వేడుకలను ఆనంద్‌బాగ్ చౌరస్తాలో లక్ష్మీ నరసింహ రజక సంఘం ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు ఆర్. పోచయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి జయంతి వేడుకలు నిర్వహించారు.

ఈ సందర్భంగా సంఘం కార్యదర్శి కాసర్ల నాగరాజు మాట్లాడుతూ.. తెలంగాణ రైతాంగ పోరాటంలో చాకలి



ఐలమ్మ ధైర్యంగా నిలబడి ప్రజల్లో పోరాట స్ఫూర్తిని నింపారని అన్నారు. సామాజిక వివక్ష, భూస్వామ్య ఆధిపత్యానికి వ్యతిరేకంగా ఆమె సాగించిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిందని పేర్కొన్నారు. పేదలు, రైతులు, అణగారిన వర్గాల హక్కుల కోసం ఐలమ్మ చూపిన తెగువ నేటి తరానికి ఆదర్శమని అన్నారు. ఆమె ఆశయాలను స్మరించుకోవడంతో పాటు సమాజంలో సమానత్వం, ఆత్మగౌరవం, న్యాయం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో రజక సంఘం నాయకులు ఎన్. బాబు, ఎన్. దేవయ్య, బి. రాజు, ఎం. కనకయ్య, బి. రాములు, ఏ. సైదులు, ఆర్. కిష్టయ్య, ఎం. ప్రవీణ్, పి. ధనరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా ఘన నివాళులు

**జన సముద్రం న్యూస్ । నల్లగొండ । నాంపల్లి । సెప్టెంబర్ 26:**



తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు ధీరవనిత చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా నాంపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కత్తి రవీందర్ రెడ్డి ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఆమె పోరాట స్ఫూర్తిని స్మరించుకున్నారు.

భూస్వామ్య దోపిడీ వెట్టిచాకిరీ నిరంకుశత్వానికి వ్యతిరేకంగా చాకలి ఐలమ్మ ధైర్యంగా పోరాడారని కత్తి రవీందర్ రెడ్డి పేర్కొన్నారు.సాధారణ కుటుంబం నుంచి వచ్చినప్పటికీ అన్యాయాన్ని ఎదిరించి పేదలు రైతులు కూలీల హక్కుల కోసం ఆమె సాగించిన పోరాటం తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు.

మహిళా ధైర్యానికి ఆత్మగౌరవానికి పోరాట స్ఫూర్తికి చాకలి ఐలమ్మ ప్రతీకగా నిలిచారని అన్నారు.ఆమె ఆశయాలను నేటి తరానికి తెలియజేస్తూ సమాజంలో సమానత్వం సామాజిక న్యాయం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నాడు

# లోకేశ్వరం మండలం గ్రామం బిలోలి



**సెప్టెంబర్ 26 జన సముద్రం**

పర్యావరణ కాలుష్యం నుంచి నిర్మల్ జిల్లా లోకేశ్వరం మండలం గ్రామం బిలోలి గ్రామపంచాయతీ వినూత్న ఉపక్రమించింది ప్లాస్టిక్ వద్దు పరిశుభ్రత ముద్దు నినాదంతో శనివారం గ్రామంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు సింగిల్ యూస్ ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నివారించడమే లక్ష్యంగా ఎంపీ ఓ సల్మాన్ రాజ్ సర్పంచ్ టీ నివేదిత రాజశేఖర్ రావు సెక్రెటరీ బి ప్రత్యూష ఉపసర్పంచ్ కడారి రాజశేఖర్ గ్రామస్తులు పాల్గొన్నారు

# ఎల్కతుర్తిలో వార సంత ఏర్పాటు చేయాలి



**ఎల్కతుర్తి సెప్టెంబర్ 26(జనసముద్రం)**

హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలో ప్రతి శుక్రవారం వార సంత (అంగడి) నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎల్కతుర్తి గ్రామపంచాయతీ కార్యదర్శి జె. శ్రీనివాస్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు.ఎల్కతుర్తిలో వార సంత ఏర్పాటు చేస్తే మండల కేంద్రంతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు అన్ని రకాల కూరగాయలు, పండ్లు, నిత్యావసర వస్తువులు ఒకే చోట అందుబాటులోకి వస్తాయని తెలిపారు.రైతులు, చిరు వ్యాపారులకు కూడా తమ ఉత్పత్తులను విక్రయించుకునే అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రతి శుక్రవారం వార సంత నిర్వహించేందుకు గ్రామపంచాయతీ తరఫున చర్యలు చేపట్టాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎల్కతుర్తి ఉప సర్పంచ్ గోడిశాల రాజయ్య గౌడ్, సింగిల్ విండో సొసైటీ మాజీ వైస్ చైర్మన్ మునిగడప శేషగిరి, ఎల్కతుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) డైరెక్టర్ గోడిశాల రాజయ్య గౌడ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు డాక్టర్ బొల్లెపోగు రమేష్ బాబు, శనిగరపు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# సీఎం పర్యటనను విజయవంతం చేయాలి.

**సిరిసిల్లపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి.**

**మంత్రి తుమ్మల నాగేశ్వరరావు.**

**జనసముద్రం రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 26**



రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఈ నెల 30న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటించనున్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం సిరిసిల్ల పట్టణంలోని సాయి మణికంఠ గార్డెన్స్‌లో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఉదయం జరిగిన ఈ సమావేశంలో జిల్లా కాంగ్రెస్ ఇన్‌చార్జి సంగీతం శ్రీనివాస్, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో పాటు మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, ఆడ్లూరి లక్ష్మణ్, వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం, కవ్వంపల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టి సిరిసిల్ల జిల్లాపై పడిందని, దీంతో ఈ ప్రాంత ప్రజలకు మంచి రోజులు రానున్నాయని అన్నారు. ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేసేందుకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

సీఎం సభకు పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యేలా మండలాలు, గ్రామాల వారీగా పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా చేపట్టే కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు నాయకులు బాధ్యతగా వ్యవహరించాలని కోరారు.

ఈ సన్నాహక సమావేశంలో మాజీ ఎమ్మెల్యే మృత్యుంజయం, జిల్లా కాంగ్రెస్ నాయకులు, వివిధ మండలాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు

# జర్నలిస్టు జనానికి అంకితం.. కుటుంబానికి దూరం

- 25 ఏళ్ల జర్నలిజం ప్రస్థానం.. నేడు ఆసుపత్రి పాలైన సీనియర్ జర్నలిస్టు...
- జనం కోసం కలం పట్టాడు.. నేడు కుటుంబం కోసం చేయూత కోరుతున్నాడు..
- 25 ఏళ్ల జర్నలిజం.. నేడు ఆపన్నహస్తం కోసం ఎదురుచూపు..

**(జనసముద్రం న్యూస్)జగిత్యాల జిల్లా**



రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలు.. కరీంనగర్ చల్మడ ఆనందరావు ఆసుపత్రిలో చికిత్స
భార్య, ఇద్దరు ఆడపిల్లల భవిష్యత్తు కోసం ఆర్థిక సహాయం కోరుతున్న కుటుంబం..

**జగిత్యాల జిల్లా కేంద్రం..**

జనం సమస్యలను తన సమస్యలుగా భావిస్తూ.. ప్రజల గొంతుకగా నిలుస్తూ.. గత 25 ఏళ్లుగా జర్నలిజం వృత్తినే నమ్ముకుని ముందుకు సాగుతున్న సీనియర్ జర్నలిస్టు గాజుల నాగరాజు నేడు ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తున్న పరిస్థితి ఏర్పడింది.

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో జర్నలిస్టుల కోసం పనిచేస్తూ.. పలు కీలక పదవుల్లో కొనసాగిన నాగరాజు, జగిత్యాల జిల్లా ఏర్పడిన తర్వాత కూడా జిల్లా స్థాయిలో బాధ్యతలు నిర్వహించారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో, ముఖ్యంగా అక్రిడిటేషన్లు, బస్ పాసులు తదితర అంశాల్లో ఎంతోమందికి సహాయం అందించారు.

ప్రతి జర్నలిస్టును "అన్నా" అంటూ ఆప్యాయంగా పలకరించే నాగరాజు.. తన జీవితంలో ఎక్కువ భాగాన్ని జర్నలిజానికే అంకితం చేశారు.

అయితే.. జర్నలిజాన్నే నమ్ముకుని జీవించిన ఆయన కుటుంబం మాత్రం ప్రస్తుతం తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటోంది. సొంత ఇల్లు లేదు.. భూమి లేదు.. ఆర్థికంగా వెనుకబడి ఉన్న పరిస్థితుల్లో భార్య, ఇద్దరు ఆడపిల్లల బాధ్యతలను మోస్తూ కుటుంబాన్ని నెట్టుకొచ్చారు.

ఇటీవల నాగరాజు రోడ్డుపై నడుచుకుంటూ వెళు న్న సమయంలో గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డారు. తొలుత జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అందించగా.. మెరుగైన వైద్యం కోసం ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అనంతరం కరీంనగర్‌లోని చల్మడ ఆనందరావు ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు.

ప్రస్తుతం నాగరాజు చికిత్స కోసం రోజుకు వేల రూపాయలు ఖర్చవుతున్నాయి. ఇప్పటికే కుటుంబంపై అప్పులు ఉన్నాయి. మరోవైపు ఇంటి అద్దె, నిత్యావసరాలు, పిల్లల చదువులు, వైద్య ఖర్చులు.. ఇలా కుటుంబంపై ఆర్థిక భారం మరింత పెరిగింది.

నాగరాజు భార్య బీడీలు చుడుతూ రోజుకు వచ్చే కొద్దిపాటి ఆదాయంతో కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. ఒకవైపు భర్త ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా.. మరోవైపు ఇద్దరు ఆడపిల్లల భవిష్యత్తు ఎలా ఉంటుందోనని ఆ కుటుంబం ఆందోళన చెందుతోంది.

జర్నలిజం కుటుంబంలో మనలో ఒకరిగా ఉన్న నాగరాజు కుటుంబం ప్రస్తుతం మన అందరి సహాయాన్ని ఆశిస్తోంది.

జగిత్యాల పట్టణ ప్రెస్ క్లబ్ సభ్యులు ఇప్పటికే తమ వంతుగా కొంత ఆర్థిక సహాయం అందించారు. అయితే ప్రస్తుతం కొనసాగుతున్న వైద్య ఖర్చులకు ఆ సహాయం సరిపోవడం లేదు.

కాబట్టి జగిత్యాల జిల్లాలోని ప్రతి జర్నలిస్టు.. నాగరాజు కుటుంబ పరిస్థితిని తమ కుటుంబ సమస్యగా భావించి, తమకు చేతనైనంత ఆర్థిక సహాయం అందించాలని విజ్ఞప్తి.

మన చిన్న సహాయం.. ఆ కుటుంబానికి పెద్ద భరోసా కావచ్చు.

మన చేయూత.. ఇద్దరు ఆడపిల్లల భవిష్యత్తుకు ఒక ఆశాకిరణం కావచ్చు.

జర్నలిస్టుల కోసం ఎన్నో సందర్భాల్లో ముందుండి పనిచేసిన గాజుల నాగరాజుకు.. ఈ కష్ట సమయంలో జర్నలిస్టు సమాజం అండగా నిలవాల్సిన సమయం ఇది.

ఆపదలో ఉన్న సహచర జర్నలిస్టు కుటుంబానికి మన వంతు చేయూత అందిద్దాం.. ఆ కుటుంబంలో మళ్లీ ఆశలు నింపుదాం.

# పర్యాటక అభివృద్ధికి మంచిర్యాల జిల్లాలో అపార అవకాశాలు,

- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్,

**జన సముద్రం న్యూస్ మంచిర్యాల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 26, 2026:**





ప్రకృతి వనరులు, పర్యావరణ సమతుల్యత, చారిత్రక, ఆధ్యాత్మిక, సాహస పర్యాటకానికి జిల్లాలో అపార అవకాశాలు ఉన్నాయని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో వేడుకలకు జిల్లా అటవీ అధికారి రాహుల్ కిషన్ జాదవ్, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, జిల్లా రెవెన్యూ అధికారి మోతీరామ్, జిల్లా పర్యాటక నోడల్ అధికారి ఒ ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ విలాయత్ అలీ, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాసరావు లతో కలిసి హాజరై మంచిర్యాల జిల్లా పర్యాటక స్థలాల గురించి జిల్లా టూరిజం నోడల్ ఆఫీసర్ ఒ ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ తయారు చేసిన మంచిర్యాల టూరిజం డిపార్ట్మెంట్ లోగోతో పాటు టూరిజం మ్యాగజైన్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మాట్లాడుతూ జిల్లాలో పర్యాటక ప్రాంతాలకు ఉన్న సామర్థ్యంతో పోలిస్తే ప్రస్తుతం పర్యాటకుల రాక తక్కువగా ఉందని, జిల్లాలోని పర్యాటక ప్రదేశాలను విస్తృతంగా ప్రచారం చేసి పర్యాటకుల సంఖ్యను పెంచేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలోని పర్యాటక ప్రాంతాల వివరాలను మ్యాగజైన్‌తో పాటు జిల్లా అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో ఎకో టూరిజంతో పాటు టెంపుల్ టూరిజాన్ని అభివృద్ధి చేయడానికి చర్యలు చేపడుతున్నామని, సాహస పర్యాటకానికి అనువైన ప్రాంతాలలో రాక్ క్లైంబింగ్ వంటి కార్యక్రమాలను ప్రోత్సహించడంతో పాటు, శివ్వారం వన్యప్రాణి సంరక్షణ కేంద్రం వంటి ప్రాంతాలను పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి అవకాశాలను పరిశీలించాలని, తాడోబా వైపు వెళ్లే మార్గంలో మంచిర్యాల జిల్లాలో పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయడానికి మంచి అవకాశాలు ఉన్నాయని తెలిపారు. పర్యాటకం ద్వారా వచ్చే ఆదాయాన్ని పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి సముచితంగా వినియోగించేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. జిల్లాలోని పర్యాటక ప్రాంతాలపై విద్యార్థులు, ప్రజలకు అవగాహన కల్పించేందుకు పాఠశాల విద్యార్థులను వివిధ పర్యాటక ప్రదేశాలకు ఎక్స్కర్షన్‌లకు తీసుకెళ్లేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. విద్యార్థులకు పర్యాటకంపై క్విజ్‌లు, పోటీ పరీక్షలు నిర్వహించడం ద్వారా పర్యాటక ప్రాధాన్యతపై అవగాహన పెంపొందించవచ్చని, ప్రజలు, అధికారులు, సంబంధిత శాఖలు సమిష్టిగా కృషి చేస్తే జిల్లాలో పర్యాటక రంగాన్ని మరింత అభివృద్ధి చేయవచ్చని తెలిపారు.

జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) మాట్లాడుతూ పర్యాటక అభివృద్ధిలో భాగంగా జిల్లాలోని గూడెం సత్యనారాయణ స్వామి ఆలయ అభివృద్ధికి నిధులు కేటాయించి పనులు కొనసాగుతున్నాయని, గోదావరి పుష్కరాలు ప్రారంభమయ్యే నాటికి పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. గాంధారి ఖిల్లా, సింగరేణి సంస్థ ద్వారా నల్ల బంగారమైన బొగ్గు నిల్వల వెలికితీత వంటి జిల్లాలోని చారిత్రక, పారిశ్రామిక విశేషాలను పర్యాటక రంగం ద్వారా ప్రజలకు పరిచయం చేయవలసిన అవసరం ఉందని తెలిపారు. పర్యాటక ప్రదేశాలు ప్రజలకు ఆహ్లాదాన్ని అందించడంతో పాటు చారిత్రక, సాంస్కృతిక అంశాలను ప్రాచుర్యంలోకి తీసుకువస్తాయని తెలిపారు. జ్ఞాన భారతం కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని పురాతన మాన్యుస్క్రిప్టులను గుర్తించే ప్రక్రియ కొనసాగుతోందని, వాటిని సంరక్షించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం ద్వారా జిల్లాలోని చారిత్రక వారసత్వాన్ని మరింత ప్రాచుర్యంలోకి తీసుకురావచ్చని తెలిపారు. వివిధ పర్యాటక ప్రాంతాలను అనుసంధానిస్తూ టూరిజం సర్క్యూట్‌లను అభివృద్ధి చేయవలసిన అవసరం ఉందని తెలిపారు.

ఈ సందర్భంగా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో పాఠశాల, ఇంటర్మీడియట్ స్థాయిలో పర్యాటకంపై నిర్వహించిన వ్యాసరచన, క్విజ్, పెయింటింగ్ పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేశారు.

ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మంచిర్యాలలో ఫెన్సింగ్ పోటీలకు ఘనంగా శ్రీకారం,

- అండర్-14, అండర్-17 బాలబాలికల జోనల్ స్థాయి పోటీలు ప్రారంభం,

**జన సముద్రం న్యూస్ మంచిర్యాల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 26:**



స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ మంచిర్యాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అండర్-14, అండర్-17 బాలబాలికల ఫెన్సింగ్ జోనల్ స్థాయి పోటీలు శనివారం మంచిర్యాలలోని పీవీఆర్ గార్డెన్స్‌లో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్, స్కూల్ గేమ్స్ సెక్రటరీ ఎండీ యాకూబ్, ఎస్ఐ సంతోష్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. వివిధ పాఠశాలలకు చెందిన సుమారు 200 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ ధర్ని మధుకర్ మాట్లాడుతూ.. క్రీడల ద్వారా విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం క్రీడాకారులకు పెద్దపీట వేస్తూ క్రీడల అభివృద్ధికి ప్రోత్సాహం అందిస్తోందని తెలిపారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్లు తాళ్ల సంపత్ రెడ్డి, పత్తి ప్రకృతి వెంకటేష్, కర్రు శ్రీనివాస్, అగ్గు సాగర్, రగ్బీ అసోసియేషన్ ఉపాధ్యక్షులు లింగంపల్లి శేఖర్, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు అట్కాపురం సతీష్, అంగడి రాజేష్, భీమిని రాజేష్, మాజీ ఉపసర్పంచ్ మోతె కనకయ్య పాల్గొన్నారు. పోటీల నిర్వాహకులు ఇదునూరి వెంకటేష్, ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆవునూరి మహేష్, సీనియర్ క్రీడాకారులు ఆవునూరి సురేష్, కటకం కళ్యాణ్ కుమార్, పీడీలు సురేష్, మల్లిక, పలువురు పీఈటీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

# శనివారం రోజున పోటెత్తిన భక్తులు

### అనుమాస్పల్లి ఆంజనేయ స్వామిని దర్శించుకున్న తదితరులు



**కడ్తాల్ న్యూస్ (సెప్టెంబర్ 26) జనసముద్రం**

శనివారం సందర్భంగా అనుమాస్పల్లి శ్రీ ఆంజనేయ స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు.

ఈ సందర్భంగా శ్రీకాంత్ గుప్తా, రావుల శివ, రాజు గౌడ్, కంబాల రామకృష్ణ, బుచప్ప , దేగరి కృష్ణయ్య, వెంకటేష్ తదితరులు ఆంజనేయ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి ఆశీస్సులు పొందిన అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు.

శనివారం కావడంతో ఆలయ ప్రాంగణం భక్తులతో సందడిగా మారింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

# వీరనారి చాకలి ఐలమ్మ చేసిన పోరాటం స్ఫూర్తిదాయకం,

- మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య,

**జనసముద్రం న్యూస్ మంచిర్యాల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 26, 2026:**



భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం వీరనారి చాకలి ఐలమ్మ చేసిన పోరాటం అందరికీ స్ఫూర్తిదాయకమని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. శనివారం చాకలి ఐలమ్మ జయంతిని పురస్కరించుకొని జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన చాకలి ఐలమ్మ జయంతి వేడుకలకు జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు, వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి నీరటి రాజేశ్వరి, కుల సంఘాల ప్రతినిధులతో కలిసి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి, చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం పోరాటం చేసిన వీరవనిత చాకలి ఐలమ్మ అని తెలిపారు. ఆత్మగౌరవం కోసం నాటి దొరల రాచరిక పాలనను వ్యతిరేకిస్తూ ఐలమ్మ చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమని తెలిపారు. చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తిని, ధైర్యసాహసాలను గుర్తిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఐలమ్మ జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించడం సంతోషంగా ఉందని తెలిపారు. మహనీయుల జయంతి, వర్ధంతి వేడుకలను అధికారికంగా నిర్వహించడం ద్వారా వారి త్యాగాలు, ఆశయాలు, పోరాట స్ఫూర్తి భవిష్యత్ తరాలకు అందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వయోవృద్ధుల సంక్షేమం, సాధికారతకు ప్రత్యేక కార్యక్రమాలు,

- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్,

**జన సముద్రం న్యూస్ మంచిర్యాల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 26, 2026:**



వయోవృద్ధుల సంక్షేమం, సాధికారతకు ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తుందని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో గల కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా సంక్షేమ శాఖ అధికారి రౌఫ్ ఖాన్, సంక్షేమ శాఖ అధికారులతో అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం--2026 ను పురస్కరించుకొని వయోవృద్ధుల సంక్షేమం, సాధికారత వారోత్సవాలు సంబంధిత గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మాట్లాడుతూ వయవృద్ధుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతుందని తెలిపారు. వారోత్సవాలలో భాగంగా వయోవృద్ధుల ఆరోగ్యం, భద్రత, డిజిటల్ అవగాహన, సామాజిక అనుసంధానం, చట్టపరమైన హక్కులు, సంక్షేమం వంటి అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. 28న సైబర్ భద్రత, డిజిటల్ అక్షరాస్యత, వయోవృద్ధులపై వేధింపుల నుంచి రక్షణపై అవగాహన, 29న తరతరాల మధ్య అనుబంధం, పరస్పర అభ్యాసం కార్యక్రమాలు, 30న చురుకైన వృద్ధాప్యం, ఆరోగ్య పరిరక్షణ, వాకథాన్, అక్టోబర్ 1న రాష్ట్ర, జిల్లా స్థాయిలో అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. తల్లిదండ్రులు, వయోవృద్ధుల పోషణ మరియు సంక్షేమ చట్టం--2007, నియమాలు--2011 ప్రకారం వయోవృద్ధులకు అందుబాటులో ఉన్న హక్కులు, రక్షణ చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందని, వయోవృద్ధులపై నిర్లక్ష్యం, వేధింపులు, ఇతర సమస్యలు ఎదురైనప్పుడు సంబంధిత అధికారులను సంప్రదించాలని తెలిపారు. వయోవృద్ధుల సంక్షేమం, రక్షణకు సంబంధించిన హెల్ప్‌లైన్ నంబర్ 14567 కు ఫోన్ చేసి సహాయం పొందవచ్చని, పోలీస్ హెల్ప్‌లైన్ 100ను సంప్రదించవచ్చని తెలిపారు. వయోవృద్ధుల పట్ల కుటుంబ సభ్యులు, సమాజంలోని ప్రతి ఒక్కరూ గౌరవం, భద్రత, సహకారం అందిస్తూ వారి సంతోషకరమైన, ఆరోగ్యకరమైన జీవనానికి తోడ్పడాలని తెలిపారు.

శనివారం వృద్ధాప్య గృహాల కోసం సామర్థ్య నిర్మాణ కార్యక్రమాలలో భాగంగా జిల్లాలోని వయోవృద్ధుల డే కేర్ సెంటర్‌లో ఉచిత మెగా శిబిరం నిర్వహించడం జరిగిందని తెలిపారు. వైద్య శిబిరంలో వయోవృద్ధులకు బి.పి., షుగర్, కంటి పరీక్షలు, ఎముకల సాంద్రత పరీక్షలు నిర్వహించడం జరిగిందని, వయస్సుతో వచ్చే కీళ్ల నొప్పులు, మానసిక ఒత్తిడి, జ్ఞాపకశక్తి సంబంధిత సమస్యలపై వైద్యులు కౌన్సెలింగ్ అందించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, వయోవృద్ధులు తదితరులు పాల్గొన్నారు.

# పబ్లిక్ మీటింగ్ స్థలాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్





**జనసముద్రం రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 26**

ఈనెల 30వ తేదీన సీఎం రేవంత్ రెడ్డి జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని వద్ద
రగుడు బై పాస్ రోడ్ వద్ద పబ్లిక్ మీటింగ్ నిర్వహించనున్న పబ్లిక్ మీటింగ్ స్థలాన్ని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితె తో కలిసి శనివారం పరిశీలించారు.

మీటింగ్ కోసం స్థలాన్ని చదును చేసే పనులు కొనసాగుతుండగా, పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అక్కడి నుంచి వాహనాల పార్కింగ్ కోసం కేటాయించిన స్థలాలను పరిశీలించారు.

వివిధ వాహనాల కోసం పార్కింగ్ ఏర్పాట్లు పక్కాగా చేయాలని ఆదేశించారు. ఆర్ అండ్ బీ అధికారులు ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలని సూచించారు.

పరిశీలనలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, జిల్లా అటవీ శాఖ అధికారి సత్యనారాయణ, ఆర్డీఓలు శ్రీధర్ బాబు, కే ఎస్ బీ కుమారి, ఆర్ అండ్ బీ ఈఈ భీమ్లానాయక్, మిషన్ భగీరథ ఈఈలు అన్వర్, సుమలత, జిల్లా వైద్యాధికారి ఏంజెలా ఆల్ఫ్రెడ్, మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా, తహసీల్దార్ మహేష్ తదితరులు పాల్గొన్నారు

# గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలి : అంగన్‌వాడీ సూపర్‌వైజర్ దివ్య



**కందుకూరు న్యూస్( సెప్టెంబర్ 26)జనసముద్రం**

గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు బలవర్ధకమైన పౌష్టికాహారం తీసుకోవాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ దివ్య సూచించారు. గురువారం కందుకూరు మండలం మాన్యగూడ గ్రామం అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్లు, కల్యాంకర్ అనిత ఆధ్వర్యంలో పోషణ్, పోషకాల వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు.

అనంతరం సరైన పౌష్టికాహారం తీసుకోవడం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని, జీరో ట్రాక్ వ్యాధులను కూడా నయం చేయవచ్చని పలు అంశాలపై అవగాహన కల్పించారు. ప్రతి ఏటా సెప్టెంబర్ నెలలో అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాల వారోత్సవాలు, పోషణ్ మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. గర్భిణులు, మహిళలు, ఆరేళ్ల లోపు పిల్లలకు వ్యాధులు రాకుండా పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# నర్మెట్ట ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ తెలంగాణకే మణిహారం

**•వ్యవసాయ మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

జన సముద్రం న్యూస్, కోహెడ
సెప్టెంబర్ 26 :
(కోహెడ ప్రసాదరావు)





సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మెట్ట గ్రామంలోని ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ తెలంగాణ రాష్ట్రానికి మణిహారము వంటిదని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. జిల్లా కలెక్టర్ కె.హైమావతి తో కలిసి మంత్రి ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీని శనివారం సందర్శించారు.ఫ్యాక్టరీ పనితీరును, నీటి లభ్యతను మంత్రి పరిశీలించారు.

ఈ కార్యక్రమంలో సిద్దిపేట ఆర్డీవో సదానందం, మార్కెట్ కమిటీ చైర్మన్లు, ఇతర ప్రజాప్రతినిధులు, ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ అధికారులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ,

మంత్రిగా తొలి సంతకం నర్మెట్ట ఆయిల్ ఫ్యాన్ ఫ్యాక్టరీ నిర్మాణానికే చేసినట్లు వెల్లడించారు.

అధికారుల కృషి వలన ఫ్యాక్టరీ త్వరగా నిర్మాణం పూర్తయిందని తెలిపారు. మార్చి నుండి ఇప్పటివరకు ఈ ఫ్యాక్టరీలో 70 వేల మెట్రిక్ టన్నుల గెలలను ప్రాసెస్ చేయడం జరిగిందని తెలిపారు.

ఈ ఆయిల్ ఫ్యాక్టరీలో ఓఈఆర్ అధికంగా వచ్చి రైతులకు మంచి ఆదాయం వస్తుందని వివరించారు వివరించారు.

ఫ్యాక్టరీ నిర్మాణం ప్రారంభించినప్పుడు 12 వేల రూపాయల ధర టన్నుకు ఉండగా ఇప్పుడు 24 వేల రూపాయలకు పెరిగిందని చెప్పారు.

దేశంలోనే అత్యాధునిక యంత్రాలతో నిర్మించిన నర్మెట్ట ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ తెలంగాణ రాష్ట్రానికి మణిహారం గా ఉందని ఆయన కొనియాడారు.

రాష్ట్రం నడి మధ్యలో గుండెకాయ లాగా ఉండి, అన్ని జిల్లాలకు సేవలను అందిస్తుందని వివరించారు.

ఖమ్మం జిల్లా కూడా రాష్ట్రంలో ఒక మూలల్లో ఉండడం వల్ల పామాయిల్ రైతులకు అక్కడి ఫ్యాక్టరీలు రాష్ట్రం మొత్తానికి సేవలందించడం లేదని అన్నారు.

పదివేల ఎకరాలు ఆయిల్పామ్ తోటల్ ఉన్న జిల్లాకు ఒక ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ నిర్మించాలనేది ప్రభుత్వ లక్ష్యంగా పేర్కొన్నారు.

ప్రస్తుతం 11 ఫ్యాక్టరీలు ప్రభుత్వ మరియు ప్రైవేటు రంగంలో నిర్మాణంలో ఉన్నాయని అన్నారు.

రిలయన్స్ సంస్థ సహితం తెలంగాణలో రిఫైనరీ తో కూడిన ఆయిల్ సన్ ఫ్యాక్టరీ నిర్మించేందుకు ముందుకు వచ్చిందని వివరించారు.

10 లక్షల ఎకరాలతో దేశంలో సగానికి పైగా ఆయిల్ ఫామ్ తోటలు తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ లోనే ఉన్నాయని తెలిపారు తెలిపారు.

40 సంవత్సరాల క్రితం తోటల పెంపకం ప్రారంభమైన ఆంధ్రప్రదేశ్లో ఆరు లక్షలు, మూడు, నాలుగు సంవత్సరాల క్రితం ప్రారంభమైన తెలంగాణలో నాలుగు లక్షల ఎకరాలలో పంట పండిస్తున్నారని వివరించారు.

రానున్న మూడు, నాలుగు సంవత్సరాలలో తెలంగాణలో 10 లక్షల ఎకరాలలో ఆయిల్ ఫామ్ సాగు జరగాలని తన ఆకాంక్ష ఉందని అని అయన అన్నారు.

నర్మెట్ట ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీలో రిఫైనరీ పనులు నడుస్తున్నాయని, వచ్చే సంవత్సరం నాటికి రిఫైనరీ పూర్తయి ఇక్కడే ఆయిల్ ఉత్పత్తి చేయడం జరుగుతుందని తెలిపారు .

ఫ్యాక్టరీలో ఉత్పత్తి అయ్యే గెలల పిప్పి నుండి నాలుగు వాట్ల యూనిట్ల విద్యుత్తు ఇక్కడే ఉత్పత్తి చేసి ఫ్యాక్టరీకి వాడుతున్నామని వివరించారు.

ఇందులోనుండి వచ్చే మురుగునీటిని కూడా మళ్లీ శుద్ధి చేసి ఫ్యాక్టరీ అవసరాలకు వాడుతున్నాము. దానివలన చుట్టుపక్కల రైతులకు ఎలాంటి నష్టం జరగడం లేదని అన్నారు.

ఈ సంవత్సరం వర్షాభావం వలన ఫ్యాక్టరీలో నీటి సమస్య తలెత్తడంతో జిల్లా కలెక్టర్ కె.హైమావతి ప్రత్యేక శ్రద్ధ తీసుకొని తపస్పల్లి రిజర్వాయర్ నుండి నీటిని పంపిణీ చేయించి ఫ్యాక్టరీకి పంపించారు. అందుకు జిల్లా కలెక్టర్ కు ప్రభుత్వం తరఫున కృతజ్ఞతలు తెలియజేశారు.

దేశంలో 70 లక్షల ఎకరాల్లో ఆయిల్ ఫామ్ పంటలు పండిస్తే మనకి విదేశీ మారకద్రవ్యం చాలా మిగులుతుందని ఆయన అన్నారు.

44 శాతం ఇంపోర్టు డ్యూటీని అమలు చేసి ఆయిల్ ఫామ్ రైతులకు లబ్ధి చేకూర్చాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నామని తెలిపారు.

ఇప్పటికే రాష్ట్రంలోని ఎంపీల ద్వారా కేంద్రానికి విజ్ఞప్తి చేయడం జరిగిందని తెలిపారు .ఎలాంటి ప్రకృతి వైపరీత్యాలు వచ్చిన, ఎలాంటి ఇబ్బందులు లేకుండా స్థిర అధిక ఆదాయాన్ని సమకూర్చే ఆయిల్ ఫామ్ తోటలను పండించేందుకు రైతులు అధికంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

# తండ్రికి తల కొరివి పెట్టిన ఇద్దరు కూతుర్లు.

జన సముద్రం న్యూస్,పినపాక
నియోజకవర్గం ప్రతినిధి,
సెప్టెంబర్ 26.

**- కూతుర్లే కొడుకుగా మారి తండ్రికి దహన సంస్కారాలు.**

**- తండ్రి చివరి చూపు కోసం అమెరికా నుంచి ఇండియాకు ప్రయాణం.**



జీవితాంతం కంటికి రెప్పలా కాపాడుకుంటున్న తండ్రికి ఇద్దరు కూతుళ్లు కన్నీటితో వీడ్కోలు పలికిన హృదయ విదారకమైన సంఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, పినపాక మండలం, బయ్యారం గ్రామంలో చోటుచేసుకుంది. భద్రాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం నందు ఉద్యోగిగా పనిచేస్తున్న దొడ్డ రాజశేఖర్ రెడ్డి (సంతోష్ రెడ్డి) తన గృహంలో అకస్మాత్తుగా బాత్రూంలో కాలుజారి కింద పడటం వలన తలకు తీవ్రమైన గాయం కావడంతో అపస్మారక స్థితికి చేరుకోవడం జరిగింది. హుటాహుటిన అంబులెన్స్ నందు వైద్య సేవ నిమిత్తం తీసుకెళ్తుండగా మార్గమధ్యలో తుది శ్వాస విడిచారు. మృతుడికి భార్య నాగశ్రీ, ఇద్దరు ఆడపిల్లలు ప్రతిమ, ప్రణీత.తండ్రి మరణంతో కుటుంబంలో విషాద ఛాయలు నెలకొన్నాయి. తండ్రి మరణ వార్త విన్న కూతురు ప్రతిమ అమెరికా నుంచి హుటాహుటిన ఇండియాకు వచ్చారు. చిన్న కూతురు ప్రణీత ఉద్యోగరీత్యా చెన్నైలో ఉండగా తండ్రి మరణ వార్త విని రావడం జరిగింది. జీవితాంతం తమను ప్రేమగా చూసుకోవాల్సిన తండ్రికి చివరి వీడ్కోలు పలికే సమయంలో కూతుళు భావోద్వేగానికి గురయ్యారు. తండ్రి అంతిమ సంస్కారాల బాధ్యతను ఇద్దరు కూతుర్లు స్వీకరించి, సంప్రదాయబద్ధంగా కార్యక్రమాలను నిర్వహించారు.తండ్రి పార్థివదేహానికి నివాళు లర్పించిన అనంతరం అంతిమయాత్రలో పాల్గొన్న ఇద్దరు కూతుళ్లు శ్మశానవాటికలో తండ్రికి తలకొరివి పెట్టారు. కన్నీటి పర్యంతమవుతూ తండ్రికి చివరి వీడ్కోలు పలికిన దృశ్యం అక్కడున్న బంధువులు, స్థానికులను తీవ్ర భావోద్వేగానికి గురిచేసింది.తండ్రికి చివరి కర్మలు నిర్వహించడంలో కూతుళ్లు కూడా ముందుండగలరని చాటుతూ, తమ తండ్రి పట్ల ఉన్న ప్రేమ, బాధ్యతను చాటుకున్నారు. అమెరికా, చెన్నైలో ఉద్యోగరీత్యా స్థిరపడ్డా కూడా తండ్రి మీదున్న ప్రేమతో... బాధతో, బాధ్యతగా దహన సంస్కారాలు నిర్వహించడంతో ఇద్దరు కూతుర్లను గ్రామస్తులు, బంధువులు అభినందించారు.

# బాలికల సదనంలో మేజిస్ట్రేట్ సూరి రెడ్డి ఆకస్మిక తనిఖీ.

జన సముద్రం న్యూస్, పినపాక
నియోజకవర్గం ప్రతినిధి,
సెప్టెంబర్ 26.



చిన్నారుల సంక్షేమం, భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ,మణుగూరు మండల న్యాయ సేవా కమిటీ చైర్మన్, ప్రథమ శ్రేణి జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కంబపు సూరి రెడ్డి శనివారం మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని శివలింగాపురం బాలికల సదనాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా సదనంలోని గదులు, వంటగది, ఆవరణ, పరిసరాలను పరిశీలించి పరిశుభ్రత, వసతి సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. చిన్నారులతో మేజిస్ట్రేట్ ముచ్చటించి భోజనం, వైద్యం, విద్య, తాగునీరు, భద్రత తదితర సౌకర్యాలు సక్రమంగా అందుతున్నాయా, ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. పిల్లల ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీసి అవసరమైన వైద్య పరీక్షలను సకాలంలో నిర్వహించాలని నిర్వాహకులకు సూచించారు.

చిన్నారులు చదువుపై శ్రద్ధ పెట్టి ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని, జీవితంలో ఎదురయ్యే సమస్యలకు భయపడకుండా ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకోవాలని మేజిస్ట్రేట్ సూచించారు. ఏదైనా సమస్య ఎదురైతే సదనం నిర్వాహకులు, సంబంధిత అధికారులు లేదా న్యాయ సేవా సంస్థల దృష్టికి తీసుకురావాలని, బాలల హక్కుల పరిరక్షణకు న్యాయ సేవా సంస్థలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాయని తెలిపారు.సదనంలో చిన్నారులకు పరిశుభ్రమైన, సురక్షితమైన వాతావరణం కల్పిస్తూ వారి సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని నిర్వాహకులకు సూచించారు. అనంతరం బాలికలకు మేజిస్ట్రేట్ స్వయంగా భోజన పదార్థాలను వడ్డించి, ఆహారం రుచిగా ఉందా అని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సదనం చైల్డ్ వెల్ఫేర్ అధికారిణి దీప్తి రాణి, న్యాయవాది అంకం సర్వేశ్, లీగల్ సెల్ కోఆర్డినేటర్ రవీందర్, సదనం అసిస్టెంట్ కుమారి, కోర్టు కానిస్టేబుల్ బుచ్చిబాబు, హోంగార్డు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో గణనాథునికి ప్రత్యేక పూజలు

**•సిద్ధి వినాయక్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా అన్నదానం**

మల్కాజిగిరి
జనసముద్రం న్యూస్
సెప్టెంబర్ 26



మల్కాజిగిరి వెస్ట్ హన్మాన్ నగర్: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా వెస్ట్ హన్మాన్ నగర్‌లో సిద్ధి వినాయక్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పోతుల ఉమామహేశ్వరి వినోద్ యాదవ్ గారు హాజరై గణనాథుడికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఆధ్యాత్మికతతో పాటు సేవా భావాన్ని పెంపొందించడంలో ఇటువంటి కార్యక్రమాలు ఎంతో కీలకమని పేర్కొన్నారు. భక్తులందరికీ అన్నదానం చేయడం ద్వారా సమాజంలో ఐక్యత, మానవతా విలువలు మరింత బలపడతాయని అన్నారు.

అనంతరం భక్తులకు అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఈ అన్నదాన కార్యక్రమానికి కాలనీవాసులు



పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. భక్తులు, యువత ఉత్సాహంగా పాల్గొనడంతో వెస్ట్ హన్మాన్ నగర్‌లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో నరసింహ, ముదిరాజ్, జగదీష్, రాజు, నర్సింగ్, మణి, రాజు, హరీష్, విజయ్, అరవింద్, నాని, భరత్, దినేష్, రమేష్ తదితర నిర్వాహకులు, సభ్యులు కీలకంగా వ్యవహరించారు.

భక్తి, సేవ, సమాజ ఐక్యతే లక్ష్యంగా సిద్ధి వినాయక్ యూత్ అసోసియేషన్ నిర్వహించిన ఈ అన్నదాన కార్యక్రమం ఆద్యంతం భక్తిశ్రద్ధలతో కొనసాగింది.

# ఘనంగా వీరనారి చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు

కందుకూరు న్యూస్ (సెప్టెంబర్ 26)జనసముద్రం



కందుకూరు మండల కేంద్రంలో వీరనారి చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను నాయకులు, ప్రజాప్రతినిధులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గూడూరు లక్ష్మీ నరసింహారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. తెలంగాణ సాయుధ పోరాటంలో చాకలి ఐలమ్మ చూపిన ధైర్యసాహసాలు, చేసిన త్యాగాలు స్ఫూర్తిదాయకమని నాయకులు కొనియాడారు.

ఈ కార్యక్రమంలో కంద నర్సింహాతో పాటు పలువురు స్థానిక నాయకులు, కార్యకర్తలు మరియు ప్రముఖులు పాల్గొన్నారు.

# ఎంపీడీవో కార్యాలయంలో చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు.

జన సముద్రం న్యూస్,పినపాక
నియోజకవర్గం ప్రతినిధి,
సెప్టెంబర్ 26.



తెలంగాణ సాయుధ పోరాట వీరవనిత, బహుజనుల ఆత్మగౌరవ ప్రతీక చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను

పినపాక మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఐలమ్మ చిత్రపటానికి ఎంపీడీవో సంకీర్త్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించిన అనంతరం మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో భూమి, భుక్తి, వెట్టిచాకిరీ విముక్తి కోసం చాకలి ఐలమ్మ ధైర్యంగా పోరాడారని,అన్యాయాన్ని ఎదిరించడంలో మహిళా శక్తిని ప్రపంచానికి చాటిచెప్పిన మహనీయురాలు, ఆమె పోరాట స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని పేర్కొన్నారు. దొరల అణచివేతకు ఎదురొడ్డి హక్కుల కోసం ఆమె చేసిన పోరాటం నేటి తరానికి ఆదర్శమన్నారు .అన్యాయాన్ని ఎదిరించడంలో మహిళా శక్తిని చాటిచెప్పిన మహనీయురాలు ఐలమ్మ అని కొనియాడారు. ఆమె పోరాట స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది పాల్గొని చాకలి ఐలమ్మ సేవలను స్మరించుకుంటూ ఘన నివాళు లర్పించారు.

# అదనపు కోర్టు కేటాయింపు హర్షనీయం : చంద్రకాని గురుకృష్ణ.

జనసముద్రం న్యూస్, పినపాక
నియోజకవర్గం ప్రతినిధి,
సెప్టెంబర్ 26.



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ,మణుగూరు కోర్టుకు అదనపు కోర్టును కేటాయిస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, హైకోర్టు ఉత్తర్వులు జారీ చేయడం పట్ల మణుగూరు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ చంద్రకాని గురుకృష్ణ హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ మణుగూరు ప్రాంతంలో పెండింగ్ లో ఉన్నటువంటి కేసుల సత్వర పరిష్కారానికి ఎంతో దోహద పడుతుందని అన్నారు. అదనపు కోర్టు ఏర్పాటుతో కక్ష దారుల సమయం, వ్యయ ప్రయాసలు తగ్గడంతో పాటు త్వరితగతిన న్యాయం అందే అవకాశం ఉంటుందన్నారు. మణుగూరు ప్రాంతీయ అవసరాలను గుర్తించి అదనపు కోర్టు మంజూరు కొరకు చొరవ చూపిన తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోర్ట్‌ఫోలియో, జడ్జ్ శ్రీ జస్టిస్ జె. శ్రీనివాస్ రావు కి , భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జడ్జి జి. ప్రేమలత కి స్థానిక పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకి, మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# భూముల రీ సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలి,

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్,**

జన సముద్రం న్యూస్
మంచిర్యాల జిల్లా ప్రతినిధి
సెప్టెంబర్ 26, 2026:



భూ సమస్యల పరిష్కారం, గ్రామ నక్షాల నిర్ధారణ పటిష్టపరిచేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూముల రీ సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశం మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, జిల్లా రెవెన్యూ అధికారి మోతిరామ్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ విలాయత్ అలీ, సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఎ.డి. శ్రీనివాస్ లతో కలిసి మండల తహసిల్దార్లు, సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూముల రీ సర్వే ప్రక్రియను సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పకడ్బందీగా చేపట్టి భవిష్యత్తులో ఎలాంటి వివాదాలకు తావు లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు కడస్ట్రల్,నాన్ కడస్ట్రల్ కలిపి 12 గ్రామాలలో రీ సర్వే ప్రక్రియ మొదలు పెట్టి మొత్తంగా 30 వేల 687 ఎకరాలు ఉండగా 8 వేల 376 ఎకరాలు రీ సర్వే పూర్తి కావడం జరిగిందని,

జిల్లాలో రీ సర్వే ప్రక్రియను నిర్దేశిత నిబంధనల ప్రకారం దశల వారీగా చేపట్టడం జరుగుతుందని తెలిపారు. రీ సర్వేలో భాగంగా రాష్ట్ర గెజిట్‌లో సెక్షన్--5 నోటిఫికేషన్ జారీ చేయడం, 2 స్పెల్‌లకు సంబంధించి సెక్షన్--6 నోటిఫికేషన్‌ను జిల్లా గెజిట్‌లో ప్రచురించడం, గ్రామసభ నిర్వహించడం, గ్రామ సరిహద్దుల నిర్ధారణ చేపట్టడం, ఆవాస ప్రాంతాల సరిహద్దులను నిర్ధారించడం, అటవీ, రహదారులు, కాలువలు, నీటి వనరులు తదితర ప్రభుత్వ భూములను గుర్తించి సరిహద్దులు నిర్ధారించడం జరుగుతుందని తెలిపారు. క్షేత్రస్థాయిలో ఎంజాయ్‌మెంట్ సర్వే నిర్వహించి ఫీల్డ్ రిజిస్టర్‌ను పూర్తి చేయడం, భూమి విస్తీర్ణాల పాలిగాన్‌లను డిజిటలైజేషన్ చేయడం, షేప్‌ఫైళ్లను రూపొందించడం, భూమి పార్సెల్‌లకు ఎల్‌పిఎం నంబర్లు కేటాయించడం, ఫీల్డ్ రిజిస్టర్ ప్రతిని తహసీల్దార్‌కు అందజేసి పరిశీలన, తదుపరి ప్రక్రియ చేపట్టడం, టోపాలజీ చెక్ నిర్వహించడం, పాత రికార్డుల నుంచి కొత్త రికార్డులకు కరెక్షన్/కో-రిలేషన్ స్టేట్‌మెంట్ తయారు చేయడం జరుగుతుందని తెలిపారు. సిఎస్ఓ ద్వారా షేప్‌ఫైళ్లను ధృవీకరించడం, ఖాతా వారీగా నిర్ధారించిన విస్తీర్ణంతో సెక్షన్--9(2) నోటీసులు జారీ చేయడం, అభ్యంతరాలు/అప్పీళ్ల కోసం 60 రోజుల గడువు ఇవ్వడం, అందిన అభ్యంతరాలను డిప్యూటీ ఐఓఎస్ ద్వారా 60 రోజుల లోపు పరిష్కరించడం, అప్పీల్‌లో మార్పులు ఉంటే వాటిని రికార్డుల్లో పొందుపరచడం, తుది కో-రిలేషన్ స్టేట్‌మెంట్, తుది ల్యాండ్ రిజిస్టర్‌ను సిద్ధం చేయడం, తుది షేప్‌ఫైళ్లను సిఎస్ఓ ద్వారా ధృవీకరించడం జరుగుతుందని తెలిపారు. గ్రామ మ్యాప్, ఆవాస మ్యాప్, ట్రావర్స్ మ్యాప్ తదితర తుది రికార్డులను సిద్ధం చేయడం, భూధార్, ఎల్‌పిఎం జనరేషన్ కోసం సిఎస్ఓ నుంచి ఎన్ఐసికి సమాచారం అందించడం, సెక్షన్--13 నోటిఫికేషన్ జారీ చేయడం, గెజిట్‌లో ప్రచురించడం, తుది రికార్డులను తహసీల్దార్‌కు అప్పగించడం,

రీ సర్వే ప్రక్రియకు సంబంధించి పూర్తి నివేదిక సమర్పించాలని తెలిపారు. రీ సర్వే ప్రక్రియలో ప్రతి దశను నిబంధనల ప్రకారం పారదర్శకంగా, క్షేత్రస్థాయి పరిశీలనతో నిర్వహించి, భూముల సరిహద్దులు, విస్తీర్ణాలు, హక్కులు, సంబంధిత రికార్డులను ఖచ్చితంగా నమోదు చేయాలని తెలిపారు. భూముల రీ సర్వేకు సంబంధించి దినపత్రికలలో వచ్చే ప్రతికూల వార్తలకు ఆయా మండలాల తహసిల్దార్లు వెంటనే రిజాయిండర్లు సమర్పించాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే సారు.... పోడు గోడు.. వినండి...!

**- పోడు సమస్య పరిష్కరించాలని ఎమ్మెల్యే పాయం కు గ్రామస్తుల వినతి...!**

**- 20 సంవత్సరాలుగా అధికారుల కేసులు... గ్రామ ప్రజల ప్రదక్షిణలు.**

**జన సముద్రం న్యూస్,పినపాక నియోజకవర్గం ప్రతినిధి, సెప్టెంబర్ 26.**



గడిచిన 20 సంవత్సరాలుగా బొమ్మరాజు పల్లి గ్రామాల పోడు వివాదాన్ని ప్రభుత్వం, అధికారులు పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవట్లేదు. ఎన్నికలు జరగటం ,ప్రభుత్వాలు మారటం ముఖ్యమంత్రులు పోడు భూములకు పట్టాలిస్తాము అధికారికంగా గుర్తిస్తామని వాగ్దానాలు చేస్తూ వారి అధికార దాహాన్ని తీర్చుకుంటున్నారు తప్ప రెండు గ్రామాల పోడు సమస్యలను గుర్తించట్లేదని పోడు రైతులు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత 20 సంవత్సరాలుగా పెంటన్నగూడెం - బొమ్మరాజు పల్లి గ్రామాల మధ్య పోడు సమస్య అనేక ఉద్రిక్తతల, వివాదాల నడుమ అనేక సంవత్సరాలుగా పోడు రైతుల రక్తంతో నెత్తురోడుతున్న కూడా ప్రజాప్రతినిధులు, ప్రభుత్వం, అధికారులు స్పందించి సమస్యని పరిష్కరించే దిశగా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు.

**- ఎమ్మెల్యే పాయం నాడు అరకపట్టి దున్నిన భూమి :**

25 హెక్టార్ల భూమిని పోడు కొట్టుకున్న రైతులకు న్యాయం చేసే విధంగా చర్యలు తీసుకుంటానని నేటి ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆనాడున సిపిఎం ఎమ్మెల్యేగా పార్టీలో ఉండి రైతుల సమక్షంలో అరక పట్టి పోడు భూమిని దున్నడం జరిగింది. 20 సంవత్సరాలుగా వివాదాల నడుమ కొనసాగుతున్న ఈ పోడు భూమి సమస్య ఎమ్మెల్యే పాయం దృష్టిలో ఎప్పటినుంచో ఉంది. ప్రభుత్వం ద్వారా అధికారుల సహకారంతో రెండు గ్రామాల రైతుల పోడు సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటే బాగుంటుంది.

**- గిరిజనులకు వ్యతిరేకం కాదు: పెంటన్నగూడెం గ్రామస్తులు.**

రెండు గ్రామాల మధ్య నలుగుతున్న ఈ పోడు సమస్యను కులాల మధ్య చిచ్చుగా పరిగణించవద్దని... ఎట్టి పరిస్థితుల్లో గిరిజనులకు మేము వ్యతిరేకం కాదన్న పెంటన్నగూడెం గ్రామస్తుల వాదనను పరిగణలోకి తీసుకొని పోడు భూమిని చదును చేసుకున్న రైతుల వివరాలు ఆధారంగా గిరిజన రైతులకు, హరిజన రైతులకు ప్రభుత్వం పట్టాలు ఇప్పించి తమ జీవనాధారాన్ని దూరం చేయకుండా పోడు రైతుల



సమస్యను తీర్చాలని రెండు గ్రామాల ప్రజలు కోరుకుంటున్నారు.

**- కార్పొరేషన్ డిపార్ట్మెంట్ కేసులు...! అధికారులకు విన్నపాలు...!**

కార్పొరేషన్ డిపార్ట్మెంట్ కు సంబదించిన దమ్మక్కపేట బీట్ లో ఉన్న 25 హెక్టార్ల భూమిని పెంటన్నగూడెం - బొమ్మరాజు పల్లి గ్రామాల రైతులు పోడు భూమి నరికి,నాగల్లు దున్నడం, పోడు భూమిలో గుడిసెలు వేయటం అటవీ శాఖ అధికారులు కూలగొట్టడం జరిగింది. వ్యవసాయం చ్ఛసే పోడు రైతులకు అధికారుల తీరు సమస్యగా మారింది. ఎంతో కష్టపడి సాగు చేసుకుంటున్నా... పోడు భూమిపై కార్పొరేషన్ అధికారులు పలుమార్లు రైతులపై దాడి చేసి కేసులు పెట్టడం జరిగింది. పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరగటం ఆ రెండు గ్రామ ప్రజలకు అలవాటుగా మారింది.పోడు సమస్య పరిష్కారం దిశగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి అధికారుల సహకారంతో పట్టాలి ఇప్పించాలని ముక్తకంఠంతో రెండు గ్రామ ప్రజల పోడు రైతులు వేడుకుంటున్నారు.

# గోపవరం గ్రామంలో ఉచిత వైద్య శిబిరం

**•104 మొబైల్ మెడికల్ వాహనం ద్వారా వైద్య పరీక్షలు, ఉచిత మందుల పంపిణీ**

**జిల్లా ఇంచార్జి జన సముద్రం న్యూస్.తేది సెప్టెంబర్ 26**



అల్లూరి జిల్లా కొయ్యూరు మండలం చిట్టెంపాడు పంచాయతీ పరిధిలోని గోపవరం గ్రామంలో డౌనూరు పీహెచ్సీ వైద్యులు, సిబ్బంది ఆధ్వర్యంలో 104 మొబైల్ మెడికల్ వాహనం ద్వారా శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. నెలకు ఒకసారి గ్రామానికి అందుబాటులోకి వచ్చే 104 వాహనం ద్వారా గ్రామస్థులకు వైద్య పరీక్షలు, అవసరమైన వైద్య సేవలు అందించారు. ఈ శిబిరానికి వైసీపీ పార్టీ మండల కార్యదర్శి పేట్ల గాంధీ హాజరై, స్వయంగా రక్త పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ఉచిత వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.వైద్య శిబిరానికి గోపవరం, లింగపురం, రొబ్బసింగి గ్రామాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. వైద్యులు రోగులకు పరీక్షలు నిర్వహించి అవసరమైన వైద్య సలహాలు అందించగా, ల్యాబ్ సిబ్బంది రక్త పరీక్షలను నిర్వహించారు. అనంతరం అవసరమైన మందులను రోగులకు ఉచితంగా పంపిణీ చేశారు.మూడు గ్రామాల ప్రజలు 104 మొబైల్ మెడికల్ సేవలను సద్వినియోగం చేసుకోవడంతో గ్రామంలో వైద్య శిబిరం విజయవంతంగా ముగిసింది.

# ఎర్రప్పాగారిపల్లె అంగన్వాడీ కేంద్రంలో ఉత్సవ్ సేవ సంకల్ప్ అభినయ్

**లక్కీరెడ్డిపల్లి జనసముద్రం న్యూస్ సెప్టెంబర్ 26**





లక్కిరెడ్డిపల్లి ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని ఎర్రప్ప గారి పల్లి అంగన్వాడి కేంద్రం నందు ఉత్సవ సేవ సంకల్ప అభినయ్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమం అంగన్వాడి సూపర్వైజర్ హుస్సేనమ్మ ఆధ్వర్యంలో శ్రీమంతం వేడుకలను నిర్వహించారు హుస్సేనమ్మ మాట్లాడుతూ మన భారతదేశ ప్రధాని నరేంద్ర మోడీ 25 సంవత్సరాల ప్రజాసేవను పురస్కరించుకొని నిర్వహిస్తున్న సేవా సంకల్ప అభినయలో భాగంగా ఈ ఉత్సవాలను సెప్టెంబర్ 25 నుంచి అక్టోబర్ 7వ తేదీ వరకు ప్రతి అంగన్వాడీ కేంద్రంలో మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు తెలిపారు అలాగే ఈ ఉత్సవ కార్యక్రమం ద్వారా పోషణ మాతృ సంరక్షణ సమాజ వేడుకలు ఈసీసీఈ ప్రధానమంత్రి మాతృ వందన యోజన పథకం గురించి వివరించారు ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లక్ష్మీనారాయణ అంగన్వాడి వర్కర్లు నాగమణి అనీషా లక్ష్మీదేవి సుగుణ తల్లులు బాలింతలు తదితరులు పాల్గొన్నారు

# ప్రజల సమస్యే మా సమస్య పరిష్కారమే మా లక్ష్యం..

**•మురుగు నీటి సమస్యకు చెక్.. డ్రైనేజీ నిర్మాణానికి శ్రీకారం**

**•వెల్జర్ల గ్రామ సర్పంచ్ ఆర్. బాబు నాయక్**

**•9.0 లక్షల ఎస్ డిఎఫ్ నిధులతో ఏళ్ల తరబడి ఉన్న డ్రైనేజీ సమస్యకు పరిష్కారం**

**•వార్డు మెంబర్లు దొడోల వెంకటేష్ యాదవ్ (డిప్యూటీ సర్పంచ్), తుప్పరి వనజాకుమార్**





వెల్జర్ల గ్రామంలో ఏళ్ల తరబడి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న మురుగు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించే దిశగా గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో డ్రైనేజీ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. గ్రామంలోని పలు ప్రాంతాల్లో మురుగు నీరు నిలిచిపోవడం, వర్షాకాలంలో ఇబ్బందులు ఎదురవడం, పరిసరాలు అపరిశుభ్రంగా మారడం వంటి సమస్యలను దృష్టిలో పెట్టుకుని డ్రైనేజీ నిర్మాణ పనులు చేపట్టినట్లు సర్పంచ్ ఆర్. బాబు నాయక్ తెలిపారు.

ప్రజల సమస్యలను గుర్తించి వాటికి ప్రాధాన్యత క్రమంలో పరిష్కారం చూపడమే గ్రామపంచాయతీ లక్ష్యమని, గ్రామంలో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచడంతో పాటు ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించేందుకు అవసరమైన అభివృద్ధి పనులను నిరంతరం కొనసాగిస్తామని ఆయన పేర్కొన్నారు.

ఈ సందర్భంగా వార్డు మెంబర్లు దొడోల వెంకటేష్ యాదవ్ (డిప్యూటీ సర్పంచ్) మరియు తుప్పరి వనజాకుమార్ మాట్లాడుతూ.. ప్రజలు ఎదుర్కొంటున్న డ్రైనేజీ సమస్యను పరిష్కరించేందుకు గ్రామపంచాయతీ తరఫున చర్యలు తీసుకోవడం సంతోషకరమన్నారు. ఏళ్లుగా ఉన్న సమస్యకు పరిష్కారం లభించడంతో స్థానిక ప్రజలకు ఎంతో ఉపశమనం కలుగుతుందని తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపడుతూ.. వెల్జర్ల గ్రామాన్ని పరిశుభ్రమైన, సౌకర్యవంతమైన గ్రామంగా తీర్చిదిద్దేందుకు అందరి సహకారంతో ముందుకు సాగుతామని సర్పంచ్, డిప్యూటీ సర్పంచ్ మరియు వార్డు మెంబర్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డ్ మెంబెర్స్ పవన్ ముదిరాజ్, రవి నాయక్, వొట్టెల ప్రవళిక మహేష్ యాదవ్, దొడ్డి లక్ష్మీ రవీందర్, తుప్పరి రమేష్, పాత్లవత్ వెంకటయ్య నాయక్, కేతవత్ లావణ్య దేవేందర్, చందు నాయక్, పంచాయతీ సెక్రటరీ మల్లేష్ యాదవ్ మరియు దాస్య నాయక్, అనిమి శివరాజ్ గౌడ్, అఖిల్ గౌడ్, తుప్పరి కుమార్ (ఖ==దీప్రా), తుప్పరి రమేష్, శివ నాయక్, శివ శంకర్ నాయక్, హరి చందర్ నాయక్, వినయ్ గౌడ్, కృష్ణ కుమార్ మరియు తదితరులు పాల్గొన్నారు.

# సామాజిక న్యాయానికి చాకలి ఐలమ్మ పోరాటం స్ఫూర్తి

**•ఐలమ్మ ఆశాలను ముందుకు తీసుకువెళ్దాం మాజీ ఎమ్మెల్యే మహేష్ రెడ్డి**



చాకలి ఐలమ్మ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆమెకు అందించే నిజమైన ఘన నివాళులు అని పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి అన్నారు.వీరనారి చాకలి ఐలమ్మ 131వ జయంతి సందర్భంగా పరిగి పట్టంలోని ఆమె విగ్రహానికి స్థానిక బిఆర్ఎస్ నాయకులతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు.వారు మాట్లాడుతూ... పేదలు బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం చాకలి ఐలమ్మ ధైర్యంగా పోరాడినారని పేర్కొన్నారు. భూమికోసం, భుక్తి కోసం జీవన హక్కుల కోసం ఆమె చేసిన పోరాటం అణగారిన వర్గాలలో చైతన్యం నింపిందని అన్నారు. సామాజిక న్యాయం, సమానత్వం ఆత్మగౌరవం కోసం ఐలమ్మ చూపిన మార్గం నేటి తరానికి ఆదర్శమని మహేష్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో అరవిందరావు ,ప్రవీణ్ రెడ్డి, రొయ్యల ఆంజనేయులు, సురేందర్, తాహిర్ అలీ, శశాంక్ రెడ్డి, మీదిగడ్డ శ్రీనివాస్,జంగయ్య,జిల్లా రజక సంఘం అధ్యక్షులు పెద్దలాల్ రాములు, జిల్లా రజక సంఘం సీనియర్ నాయకులు పెద్ద లాల్ ఆంజనేయులు, జనరల్ సెక్రెటరీ శేఖర్, కోశాధికారి నర్సింలు, ఉపాధ్యక్షులు జంగయ్య, సలహాదారులు ఆంజనేయులు, గోపాల్, శ్రీను, సాయిలు ,సభ్యులు సురేష్ ,మల్లేష్, నవీన్, రాఘవేందర్, సురేష్ బాబు, సంతు ,రజక సంఘం మహిళా సభ్యురాలు లక్ష్మీ, శాంతమ్మ, నిరంజని, లావణ్య, అంజమ్మ, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

# 15వ వార్డు లో జరిగిన ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమం





**జనసముద్రంన్యూస్, మాచర్ల, సెప్టెంబర్ 26;**

ఎమ్మెల్యే జులకంటి బ్రహ్మానంద రెడ్డి ఆదేశాల మేరకు ఇంటింటికి టిడిపి కార్యక్రమంలో భాగంగా మాచర్ల పట్టణంలోని 15వ వార్డులో ప్రభుత్వ పథకాలు, పింఛన్లు లబ్ధిదారులకు అందిస్తున్న వివరాలను ఆశావాహులకు వివరిస్తూ సమస్యల పరిష్కారానికి భరోసా కల్పిస్తూ ప్రజల చైతన్య పరుస్తూ నాయకులు మాచర్ల మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ సీనియర్ నాయకులు యాగంటి మల్లిఖార్జున రావు,
జిల్లా ఆర్యవైశ్య ఆర్గనైజింగ్ సెక్రటరీ సూరె యల్లమంద, బూత్ ఇంచార్జ్ బండ్ల బ్రహ్మం, మాచర్ల పట్టణ ప్రధానకార్యదర్శి బండ్ల శ్రీనివాసరావు,
బృంగా బాబు, రాయపాటి శ్రీనివాసరావు, చందు గౌడ్
మనోజ్ మరియు 15 వార్డ్ లోని నాయకులు, కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.

# పేదలకు అండగా ఎమ్మెల్యే మద్దిపాటి





**జనసముద్రం న్యూస్ ఏలూరు జిల్లా సెప్టెంబర్ 26 ద్వారకాతిరుమల**

జగన్నాథపురంలో అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్న 20 పేద కుటుంబాలకు గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు నెలకు సరిపడా నిత్యావసర సరుకులు అందజేశారు. సొంత ఖర్చులతో ఆయన ఈ సాయం చేశారు.శనివారం గ్రామ కూటమి నాయకులు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి సరుకులను పంపిణీ చేశారు. సాయం అందుకున్న కుటుంబాలు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపాయి.కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సహస్ర దీపాల వెలుగులో కుంకుళ్లమ్మ ఆలయం

**జనసముద్రం న్యూస్ ఏలూరు జిల్లా సెప్టెంబర్ 26 ద్వారకాతిరుమల**



ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానానికి ఉపాలయమైన కుంకుళ్లమ్మ అమ్మవారి ఆలయం శనివారం రాత్రి సహస్ర దీపాల వెలుగుల్లో దేదీప్యమానంగా వెలిగిపోయింది.పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయ ప్రాంగణంలో భక్తులు భారీ సంఖ్యలో దీపాలను వెలిగించారు. ఓంకారం, శంఖు, చక్ర, నామాల ఆకారాల్లో దీపాలను అమర్చడంతో ఆలయం కనువిందుగా మారింది.అర్చకులు అమ్మవారికి విశేష పూజలు, మంగళహారతులు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

# కొండచరియలు జారిన ప్రదేశాన్ని సందర్శించి ప్రాంతాన్ని పరిశీలించిన

**మాజీ మంత్రి వర్యులు పసుపు లేటి బాల రాజు**

**జిల్లా ఇంచార్జి జన సముద్రం న్యూస్ తేది సెప్టెంబర్ 26 అల్లూరి జిల్లా**







కొయ్యూరు: మండలంలోని చింత పూడి గాటి జాతీయ రహా దారి 516ఈ తుపాన్ ప్రభావం వలన కొండచరియలు జారిన ప్రాంతాన్ని పసుపు లేటి సందర్శించి పరిశీలించారు.
కొండచరియలు జారిన ప్రాంతాన్ని పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.
రహదారిపై ఏర్పడిన ఇబ్బందులు, రాకపోకల పరిస్థితిని పరిశీలించారు.
రహదారిపై పేరుకుపోయిన మట్టి, రాళ్లను తొలగించి రాకపోకలను పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను కోరారు.
ఈ పర్యటన లో కార్యకర్తలు అభిమానులు నాయకులు పాల్గొన్నారు

# ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి నేటి పర్యటన వివరాలు



**జనసముద్రంన్యూస్, పల్నాడు జిల్లా, మాచర్ల నియోజకవర్గం, సెప్టెంబర్ 26;**
మాచర్ల నియోజకవర్గ ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి నేడు అనగా 27.9.2026 ఆదివారం ఉదయం 8 గంటలకు మాచర్ల పట్టణంలోని 11,12,13,14వ వార్డుల నందు పర్యటిస్తారు. ఉదయం 11 గంటలకు నిమిషాలకు కారంపూడి రోడ్డులోని ఎంఎస్ఎంఈ పార్క్ వద్ద పల్నాడు వాటర్ గ్రిడ్ ప్రాజెక్ట్ పనుల్లో భాగంగా రాయవరం జంక్షన్ నుంచి కారంపూడి వరకు నిర్మించనున్న 1300 ఎం.ఎం వాటర్ పైప్ లైన్ పనులకు నిర్వహించే శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 12 గంటలకు మాచర్ల మండలం లింగాపురం గ్రామంలో గొర్రె వీరయ్య కుమార్తె పుష్పాలంకరణ కార్యక్రమంలో పాల్గొంటారు.
సాయంత్రం 5 గంటలకు మాచర్ల పట్టణంలోని 3,4,5వ వార్డుల నందు పర్యటిస్తారని, అధిక సంఖ్యలో కూటమి శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని మాచర్ల శాసన సభ్యుల వారి కార్యాలయం తెలియజేసింది.



# రామప్ప దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించిన కేశవరెడ్డి

**జనసముద్రంన్యూస్, పల్నాడు జిల్లా, మాచర్ల, సెప్టెంబర్ 26;**
మాచర్ల పట్టణంలోని రామప్ప గుడి నందు గాయత్రీ మహా యజ్ఞం సందర్భంగా టీడీపీ సీనియర్ నాయకులు యొనుముల కేశవరెడ్డి ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించటం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం తాత్కాలిక రద్దు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా

**నెల్లూరు, సెప్టెంబర్ 26: జన సముద్రం జిల్లా ప్రతినిధి.**
ఈ నెల 28వ తేదీ (సోమవారం) నిర్వహించాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.
రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మంగళవారం జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో, జిల్లా యంత్రాంగం ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లలో నిమగ్నమై ఉన్నందున ప్రజల నుంచి వినతులు స్వీకరించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఈ నెల 28న తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. కావున జిల్లా ప్రజలు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

# రోడ్లు, డ్రైనేజీ, మంచినీటి సమస్యలు తెలుసుకున్న ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి



**జనసముద్రంన్యూస్, పల్నాడు జిల్లా, మాచర్ల, సెప్టెంబర్ 26;**
మాచర్ల పట్టణంలోని కొత్త వార్డులు అయిన 6,7,9,10 వార్డులలో ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి శనివారం పర్యటించి రోడ్లు, డ్రైనేజీలు, మంచినీటి సమస్యలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాచర్ల శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మానంద రెడ్డి తోపాటు మాచర్ల పట్టణ టిడిపి పార్టీ అధ్యక్షులు కొమెర దుర్గారావు, మద్దిగపు చిన్న వెంకట్రామిరెడ్డి, కజ్జం సైదయ్య, యొనుముల కేశవరెడ్డి, సూరె యల్లమంద, మున్సిపల్ కమిషనర్ వేణు బాబు, క్లస్టర్-3 ఇన్చార్జ్ లు, కూటమి నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు పాల్గొన్నారు.



కంభంపాటి అనిల్ కుమార్, మాచర్ల పట్టణ టీడీపీ సీనియర్ నాయకులు.

# కంభంపాటి అనిల్ కుమార్ కు మాచర్ల మున్సిపల్ చైర్ పర్సన్ టికెట్ ఇవ్వాలి : మాచర్ల యువత

**జనసముద్రంన్యూస్, పల్నాడు జిల్లా, మాచర్ల టౌన్, సెప్టెంబర్ 26;**
పార్టీ అధికారంలో ఉన్నా, లేకపోయినా.. ఎప్పుడూ ప్రజల కోసం.. కార్యకర్తల కోసం ఎప్పుడూ అందుబాటులో ఉంటూ, ఎన్ని ఒడుదుడుకులు వచ్చినా సరే ముందుకు నడిచే వ్యక్తి, పార్టీలో అన్ని తెలిసిన వ్యక్తి, పార్టీ కోసం, ప్రజల కోసం నిరంతరం పని చేసే నాయకుడు, కార్యకర్తలకు అన్నయ్య లాగా, ఎలాంటి పరిస్థితుల్లోనయినా ఎల్లప్పుడూ పార్టీ కోసం పని చేసే పోరాటయోధుడు మరియు స్థానికుడైన కంభంపాటి అనిల్ కుమార్ కు మాచర్ల మున్సిపల్ ఛైర్ పర్సన్ గా టిక్కెట్ ఇవ్వాలని మాచర్ల యువత అందరూ ముక్త కంఠంతో టీడీపీ అధిష్టానాన్ని కోరుకుంటున్నారు.

# అమరావతి పార్టీ గురజాల నియోజకవర్గ ఇన్చార్జి గా గన్నెపల్లి ప్రసన్న నియామకం



గన్నెపల్లి ప్రసన్న, అమరావతి పార్టీ గురజాల నియోజకవర్గ ఇన్చార్జి.

**జనసముద్రంన్యూస్, పల్నాడు జిల్లా, సెప్టెంబర్ 26;**
అమరావతి పార్టీ గురజాల నియోజకవర్గ ఇన్చార్జి గా గన్నెపల్లి ప్రసన్న ను నియమిస్తూ అమరావతి పార్టీ ఏపీ వర్కింగ్ ప్రెసిడెంట్ నవులూరి శివారెడ్డి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా శివారెడ్డి మాట్లాడుతూ.. అమరావతి పార్టీ అధినేతృత్వం మీద నమ్మకంతో, పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి కృషి చేయాల్సిందిగా గన్నెపల్లి ప్రసన్న ను హార్థికంగా అభినందిస్తున్నామని అన్నారు.

# కొత్త మాధవరం లో స్వచ్ఛ పదం







**ఒంటిమిట్ట జనసముద్రం న్యూస్ సెప్టెంబర్ 26:**
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నూతన "స్వచ్ఛ పథం" కార్యక్రమం లో భాగంగా శనివారం , వైఎస్ఆర్ కడప జిల్లా ఒంటిమిట్ట మండలానికి చెందిన కొత్త మాధవరం గ్రామ పంచాయతీ పరిధిలో ఎంపీడీవో సుజాతమ్మ డిప్యూటీ ఎంపీడీవో చలపతి ఆధ్వర్యంలో పారిశుధ్య కార్యక్రమం ముమ్మరంగా చేపట్టారు. గ్రీన్ అంబాసిడర్లు మరియు పారిశుధ్య సిబ్బంది ద్వారా రహదారుల పక్కన పేరుకుపోయిన చెత్త కుప్పలను తొలగించే పనులు వేగవంతంగా చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సుజాతమ్మ మాట్లాడుతూ వచ్చే పదం కార్యక్రమం ద్వారా ఒంటిమిట్ట మండలంలో ముమ్మరంగా పారిశుధ్య కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు స్వచ్ఛ పదం కార్యక్రమంలో ప్రజలు కూడా భాగస్వామ్యం కావాలని కోరారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకొని వ్యాధులకు దూరంగా ఉండాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు

# పోలీసుల విధుల్లో సేవాభావం, క్రమశిక్షణ, నిబద్ధత ఎంతో ముఖ్యం










**- పోలీసుల త్యాగాలు ఈ సమాజం ఎప్పటికీ మరచిపోదు**
**- రాష్ట్ర ప్రజల రక్షణ బాధ్యతలో పోలీసుల పాత్ర అత్యంత కీలకం**
**- శిక్షణ సమయంలో సాధించిన ఫిట్నెస్ ను చివరి వరకూ కలిగి ఉండాలి**
**- పోలీసు వ్యవస్థతో మా కుటుంబానికి ప్రత్యేక అనుబంధం ఉంది**
**- రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి శ్రీ ఆనం రామనారాయణ రెడ్డి**
**- పోలీస్ ట్రైనింగ్ కళాశాలలో ఘనంగా దీక్షాంత్ పరేడ్ కార్యక్రమం**

**నెల్లూరు, సెప్టెంబర్ 26: జన సముద్రం జిల్లా ప్రతినిధి.**
రాష్ట్ర ప్రజల రక్షణలో పోలీసుల పాత్ర అత్యంత కీలకమని, విధి నిర్వహణలో సేవాభావం, విలువలు, క్రమశిక్షణ, నిబద్ధతతో పనిచేయాలని రాష్ట్రదేవాదాయశాఖమంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పేర్కొన్నారు.
శనివారం వెంకటాచలం మండలం
చెముడుగుంటలోని జిల్లా పోలీసు శిక్షణ కేంద్రంలో శిక్షణ పూర్తి చేసుకున్న పోలీసు కానిస్టేబుళ్ల దీక్షాంత్ పరేడ్‌లో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.
తొలుత పరేడ్ కార్యక్రమానికి విచ్చేసిన మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి కి ఎస్పీ అజిత వేజెండ్ల, ఏఎస్పీలు సౌజన్య, దీక్ష ఘన స్వాగతం పలికారు. తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, అతిథుల కరతాళ ధ్వనుల మధ్య పాసింగ్ అవుట్ పరేడ్ కార్యక్రమం అద్భుతంగా సాగింది.
అనంతరం పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించిన మంత్రి ఆనం పరేడ్ ను వీక్షించారు.
ఈ సందర్భంగా మంత్రి ఆనం మాట్లాడుతూ నెల్లూరు జిల్లాలో నిర్వహించిన పోలీసు పాసింగ్ అవుట్ దీక్షాంత్ పరేడ్‌లో పాల్గొనడం తన అదృష్టంగా భావిస్తున్నానని మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా గతంలో తాను పాల్గొన్న పోలీసు పరేడ్‌లు, పోలీసుల గౌరవ వందనాలు గుర్తుకు వస్తున్నాయని అన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న పోలీసు అభ్యర్థులకు, వారి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులకు మంత్రి అభినందనలు తెలిపారు.
పోలీసు కానిస్టేబుళ్లకు ఇంత గొప్పగా శిక్షణ అందించడంలో కృషి చేసిన జిల్లా ఎస్పీ డాక్టర్ అజితా వేజెండ్ల, ఇతర పోలీసు అధికారులు, సిబ్బందిని మంత్రి అభినందించారు. తాను ఈ ప్రాంతానికి ప్రాతినిధ్యం వహించిన సమయంలో పోలీసు శిక్షణ కళాశాల ఏర్పాటుకు 13.5 ఎకరాల స్థలాన్ని 2005లో పోలీసు వెల్ఫేర్ అసోసియేషన్‌కు కేటాయించిన విషయాన్ని మంత్రి గుర్తుచేశారు. ఇప్పటివరకు ఈ శిక్షణ కేంద్రం నుంచి సుమారు 805 మంది శిక్షణ పూర్తి చేసుకున్నారని తెలిపారు. తిరుపతి, విశాఖపట్నం తదితర ప్రాంతాల నుంచి వచ్చిన 176 మంది శిక్షణ పూర్తి చేసుకుని రాష్ట్ర ప్రజల రక్షణలో భాగస్వాములు కావడం సంతోషంగా ఉందన్నారు.
గతంలో కానిస్టేబుల్ ఉద్యోగాలకు ప్రధానంగా పదో తరగతి విద్యార్హత కలిగిన వారు ఉండేవారని, ప్రస్తుతం డిగ్రీలు, ఉన్నత విద్యను అభ్యసించిన వారు కూడా పోలీసు శాఖలోకి వస్తున్నారని మంత్రి పేర్కొన్నారు. పోలీసు విధులు కేవలం రక్షణకే పరిమితం కాకుండా ప్రజలకు సేవ చేయడంలోనూ కీలకమని అన్నారు.
శారీరక దారుఢ్యంతో పాటు సాంకేతిక పరిజ్ఞానం, చట్టాలపై అవగాహన, సైబర్ నేరాల నియంత్రణ వంటి వివిధ అంశాల్లో శిక్షణ అందించడం అభినందనీయమన్నారు. ప్రస్తుత సమాజంలో సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో వాటిని అరికట్టేందుకు పోలీసులకు ప్రత్యేక శిక్షణ అందించడం ఎంతో అవసరమని తెలిపారు.
తాను పోలీసు కుటుంబం నుంచి వచ్చానని మంత్రి పేర్కొన్నారు. ఒక పోలీసు అధికారికి మనవడిగా, మరో పోలీసు అధికారికి తమ్ముడి కొడుకుగా, ఇద్దరు హోం మంత్రుల కుటుంబాలతో అనుబంధం ఉన్న వ్యక్తిగా పోలీసు వ్యవస్థతో తనకు ప్రత్యేక అనుబంధం ఉందన్నారు. గతంలో పోలీసు పరేడ్‌లలో పాల్గొన్న సందర్భాలను మంత్రి గుర్తుచేసుకున్నారు.
రాష్ట్ర ప్రభుత్వంలోని అనేక ప్రధాన శాఖల్లో పోలీసు శాఖకు ప్రత్యేకమైన బాధ్యతలు, విధులు ఉన్నాయని మంత్రి అన్నారు. రాష్ట్ర ప్రజల రక్షణ బాధ్యతలో కానిస్టేబుల్ స్థాయి నుంచి ఉన్నతాధికారుల వరకు ప్రతి ఒక్కరి పాత్ర కీలకమని పేర్కొన్నారు. కుటుంబాలకు దూరంగా ఉంటూ సమాజ రక్షణకు అంకితమయ్యే పోలీసు ఉద్యోగంలో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల త్యాగం ఎంతో గొప్పదని అన్నారు.
శిక్షణ సమయంలో సాధించిన ఫిట్‌నెస్‌ను ఉద్యోగంలో చేరిన తర్వాత కూడా కొనసాగించాలని మంత్రి సూచించారు. ఒక పోలీసు అధికారి క్రమశిక్షణ, నిబద్ధత, నిజాయితీ, కమిట్‌మెంట్ అతని శారీరక దారుఢ్యంలో కూడా ప్రతిబింబిస్తాయని అన్నారు. 30 ఏళ్లకు పైగా సర్వీసు పూర్తి చేసిన తర్వాత కూడా ఇదే స్థాయి ఫిట్‌నెస్‌ను కొనసాగిస్తూ ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్షించారు.
శిక్షణను విజయవంతంగా నిర్వహించిన జిల్లా ఎస్పీ డాక్టర్ అజితా వేజెండ్ల, అడిషనల్ ఎస్పీ, ప్రిన్సిపాల్ సౌజన్య, డీఎస్పీ,వైస్ ప్రిన్సిపాల్ గిరిధరరావు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బందికి మంత్రి ప్రత్యేకంగా అభినందనలు, ధన్యవాదాలు తెలిపారు.
అనంతరం శిక్షణలో ప్రతిభ కనబరిచిన పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థులకు మెడల్స్, జ్ఞాపికలను అందించి అభినందించారు. అలాగే అభ్యర్థులకు విజయవంతంగా శిక్షణ అందించిన పోలీసు అధికారులకు కూడా మంత్రి జ్ఞాపకలు అందజేశారు.
ఈ కార్యక్రమంలో డీఎస్పీలు, సిఐలు, పలువురు పోలీస్ అధికారులు, పోలీసు శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థుల కుటుంబ సభ్యులు, ట్రైనింగ్ కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# 90 ఏళ్ల అవ్వ నోటి నుంచి వచ్చిన మాట బంగారంతో సమానం





**- 8వ వార్డులో కంటతడి పెట్టించిన 90 ఏళ్ల అవ్వ మాట**
**- "తల్లిదండ్రులను మించిన తనయుడు బ్రహ్మానంద రెడ్డి" - వృద్ధురాలి నోటి వెంట నిజం**

**జనసముద్రంన్యూస్, పల్నాడు జిల్లా, మాచర్ల, సెప్టెంబర్ 26 ;**
మాచర్ల పట్టణంలోని 8వ వార్డులో "ఇంటింటికీ తెలుగుదేశం" కార్యక్రమంలో భాగంగా తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కజ్జం సైదయ్య పర్యటిస్తున్న సందర్భంలో హృదయాన్ని హత్తుకునే ఘటన చోటుచేసుకుంది. ఒక 90 సంవత్సరాల వృద్ధురాలి ఇంటికి వెళ్లి కజ్జం సైదయ్య "అవ్వా.. మా కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి బాగుందా? పెన్షన్ వస్తుందా? పాలన ఎలా ఉంది?" అని ఆప్యాయంగా అడిగారు. అంతేకాదు "గతంలో మాచర్లను ఏలిన జూలకంటి నాగిరెడ్డి, జూలకంటి దుర్గమ్మ పాలన ఎలా ఉండేది?" అని ప్రశ్నించారు. దానికి ఆ 90 ఏళ్ల అవ్వ కళ్లలో నీళ్లు తిరుగుతుండగా చెప్పిన మాటలు అక్కడున్న ప్రతి ఒక్కరి హృదయాన్ని కదిలించాయి. "నాయనా.. జూలకంటి నాగిరెడ్డి, దుర్గమ్మ పాలన బాగుండేదయ్యా.. వాళ్ళు దేవుళ్ళు. కానీ వాళ్ళను మించినోడు వాళ్ళ కొడుకు బ్రహ్మానంద రెడ్డి అయ్యా! తల్లిదండ్రులను మించి కీర్తి ప్రతిష్టలు సంపాదించుకున్నాడు.
వాళ్ళ పేరు నిలబెడుతున్నాడు. మా పెన్షన్ మా ఇంటికే వస్తుంది. మా బిడ్డలా చూసుకుంటున్నాడు" అని ఆ అవ్వ చెప్పడంతో అక్కడున్న కూటమి నాయకులంతా భావోద్వేగానికి గురయ్యారు. తల్లిదండ్రుల ఆశయాలను కొనసాగిస్తూ, వారి కీర్తిని మరింత పెంచుతున్న తనయుడు జూలకంటి బ్రహ్మానంద రెడ్డి అని ఆ అవ్వ ఆశీర్వదించడం తో ఇంటింటి - తెలుగుదేశం ప్రచారం లో వున్న కూటమి నాయకులు చప్పట్లతో ఆనందాన్ని వ్యక్తపరిచారు. ఇదే కదా ప్రజల మనసులో ఉన్న నిజమైన అభిప్రాయం అని సైదయ్య ఆ అవ్వకు పాదాభివందనం చేశారు.

# 29 నుంచి పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు






**ఒంటిమిట్ట, జనసముద్రం న్యూస్, సెప్టెంబర్ 26:**
ఒంటిమిట్ట మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఈ నెల 29న పాఠశాల యాజమాన్య కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో అధికారులు ఏర్పాట్లను ముమ్మరం చేశారు. ఈ మేరకు మండల విద్యాశాఖ అధికారి వీరశేఖర్ ఎంపీడీవో సుజాతమ్మ, తహసీల్దార్ దామోదర్‌రెడ్డి, పోలీసు సిబ్బందిని కలిసి ఎన్నికల నిర్వహణపై సమాచారాన్ని అందజేశారు. ప్రభుత్వ మార్గదర్శకాలు, ఎన్నికల విధివిధానాలను సంబంధిత అధికారుల కార్యాలయాలకు వెళ్లి వివరించారు. మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోఎస్ఎంసీ ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ముందస్తుగా ఓటర్ల జాబితాలను పాఠశాలల్లోప్రదర్శించామని,ఎన్నికల సమాచారాన్ని విద్యార్థుల ద్వారా వారి తల్లిదండ్రులకు ఆహ్వాన పత్రాల రూపంలో అందజేశామని వివరించారు. ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా సంబంధిత శాఖల అధికారులు సహకరించాలని కోరారు. ముఖ్యంగాపాఠశాలల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు శాఖ ఆధ్వర్యంలో తగిన భద్రతా ఏర్పాట్లు కల్పించాలని పోలీసు సిబ్బందిని కోరారు.

## ప్రగడవరంలో ఘనంగా హై స్కూల్ సెంటర్ వినాయకుడి ఊరేగింపు: 13 రోజులు పూర్తి చేసుకున్న ఉత్సవాలు



**జనసముద్రం న్యూస్ చింతలపూడి ప్రతినిధి సెప్టెంబర్ 26**

చింతలపూడి: ఏలూరు జిల్లా చింతలపూడి మండలం ప్రగడవరం గ్రామంలో వినాయక చవితి వేడుకలు ఎంతో భక్తిశ్రద్ధలతో, ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగుతున్నాయి. గ్రామంలోని హై స్కూల్ సెంటర్ ఆలయం, ప్రాంతం వద్ద కొలువుదీరిన వినాయక విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం గ్రామ పురవీధుల్లో స్వామివారి శోభాయాత్ర (ఊరేగింపు) వైభవంగా సాగింది.

ఈ సందర్భంగా నిర్వహించిన గణపతి ఉత్సవాలు నేటితో విజయవంతంగా 13 వ రోజుకు చేరుకున్నాయి. భక్తుల కోలాహలం, డప్పు వాయిద్యాలు, యువకుల నృత్యాల నడుమ వినాయకుడి ఊరేగింపు కన్నులపండువగా సాగింది. గ్రామంలోని మహిళలు, భక్తులు స్వామివారికి హారతులు పట్టి విశేష పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## మున్సిపల్ సిబ్బంది సేవలు వెలకట్టలేనివి..!
### -ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి







**జన సముద్రం న్యూస్ ,పల్నాడు జిల్లా ప్రతినిధి ,సెప్టెంబర్ 26**

పట్టణానికి మున్సిపల్ సిబ్బంది అందిస్తున్న సేవలు వెలకట్టలేనివని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి వెల్లడించారు. శనివారం స్థానిక మున్సిపాలిటి నందు 30 మంది పర్మినెంట్ మున్సిపల్ సిబ్బందికి ఎమ్మెల్యే చేతుల మీదిగా నూతన యూనిఫాం వస్త్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కరోనా సమయంలో మున్సిపల్ సిబ్బంది అందించిన సేవలు మరవని అని చెప్పారు. అర్హులైన సిబ్బందికి కచ్చితంగా నివేశ స్థలాలను ముంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వేణుబాబు, కజ్జం సైదయ్య, కొమెర దుర్గారావు, మద్దిగపు వెంకటరామిరెడ్డి, కంభపాటి అనిల్ కుమార్, బీజేపీ నాయకులు క్రాంతి కుమార్, జనసేన నాయకులు కొమర లాల్ కిషన్, అవినాష్ రెడ్డి, కొమెర శివ తదితరులు పాల్గొన్నారు.

## సోమవారం 'జాతీయ నులిపురుగుల నివారణ' కార్యక్రమం



**తూర్పుగోదావరి/ సీతానగరం/ సెప్టెంబర్ 26/ జనసముద్రం న్యూస్ :**

జిల్లా కలెక్టర్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి ఆదేశాల మేరకు, అర్నాబ్ తుఫాన్ కారణంగా వాయిదా పడిన "జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమం" ఈ సోమవారం నిర్వహించనున్నట్లు సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ వి. భవాని తెలిపారు. ఈ సందర్భంగా మండలంలోని అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు మరియు కళాశాలల్లో 1 నుండి 19 ఏళ్ల వయస్సు గల 12,889 మంది పిల్లలకు 'ఆల్బెండజోల్' మాత్రలు పంపిణీ చేయనున్నారు. ఈ మాత్రల వల్ల కడుపులో నులిపురుగులు, బద్దె పురుగులు నశించి, పిల్లలు రక్తహీనత బారిన పడకుండా ఆరోగ్యంగా ఉంటారని, కావున పిల్లలందరూ తప్పక ఈ మాత్రలు తీసుకోవాలని ఆమె సూచించారు.

## విద్యుత్ సరఫరాకు అంతరాయం

**తూర్పుగోదావరి/ సీతానగరం/ సెప్టెంబర్ 26/ జనసముద్రం న్యూస్ :**

స్థానిక మండల పరిధిలోని మునికూడలి, రాజంపేట, వెదుళ్లపల్లి గ్రామాలలో మౌలిక సదుపాయాలు, అభివృద్ధి పనుల నిమిత్తం ఆదివారం నుండి బుధవారం వరకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని ఎక్జిక్యూటివ్ ఇంజినీర్ ఎన్. శామ్యూల్ ఒక ప్రకటనలో తెలిపారు. గృహ, వాణిజ్య, వ్యవసాయ విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్నిగమనించి,విద్యుత్ శాఖకు సహకరించాలని కోరారు.

## నేడు పైపులైన్ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన..!



**జన సముద్రం న్యూస్ ,పల్నాడు జిల్లా ప్రతినిధి ,సెప్టెంబర్ 26**

జల్ జీవన్ మిషన్ నిధులతో మాచర్ల నియోజవర్గంలో చేపట్టిన పల్నాడు వాటర్ గ్రిడ్ పనుల్లో భాగంగా మండల పరిధిలోని రాయవరం జంక్షన్ ఎంఎస్ఎంఈ పార్క్ వద్ద రాయవరం జంక్షన్ నుంచి కారంపూడి వరకు నిర్మించే 1300 ఎంఎం వాటర్ పైప్ లైన్ పనులకు ఆదివారం ఉదయం 11.30 నిమిషాలకు ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి చేతుల మీదిగా శంకుస్థాపన కార్యక్రమం జరుగుతోందని శాసన సభ్యుల వారి కార్యాలయం శనివారం ఓ ప్రకటనలో పేర్కొంది. ముందుగా ఉదయం 8 గంటలకు 11,12,13,14 వార్డులు, సాయంత్రం 3,4,5 వార్డుల నందు పర్యటిస్తారని వెల్లడించింది.

## నకిలీ డీ-ఫామ్ పట్టా హల్ చల్ కేసులో నలుగురిపై కేసు

**మొగల్తూరు సెప్టెంబర్ 26 జనసముద్రం పశ్చిమగోదావరి జిల్లా ప్రతినిధి**

మొగల్తూరు మండలం పేరుపాలెం, ముత్యాలపల్లి గ్రామాల్లో అసైన్డ్ భూములకు నకిలీ డీ-ఫామ్ పట్టాలు సృష్టించి మోసాలకు పాల్పడిన ఘటన వెలుగులోకి వచ్చింది. పేరుపాలెం వీఆర్ఏ కృతివెంటి రాంబాబుతో పాటు మరో ముగ్గురిపై మొగల్తూరు ఎస్ఐ వాసు కేసు నమోదు చేశారు. నకిలీ సీళ్లు, స్టాంపులతో పత్రాలు తయారు చేసినట్లు తహసిల్దార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.




## నెల్లూరు సిటీ నియోజకవర్గంలో అభివృద్ధి జాతర







- రూ.5.26 కోట్లతో ప్రధాన కూడళ్లలో ఐలాండ్లు, ఫౌంటైన్ల అభివృద్ధి
- శంకుస్థాపన చేసిన మంత్రి నారాయణ

**నెల్లూరు, సెప్టెంబర్ 26: జనసముద్రం జిల్లా ప్రతినిధి.**

నెల్లూరు నగరంలోని ప్రధాన కూడళ్లను సుందరీకరించడంతో పాటు ఐలాండ్లను అభివృద్ధి చేసి, ఫౌంటైన్లను ఏర్పాటు చేసేందుకు రూ.5.26 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ శనివారం శంకుస్థాపన చేశారు.

వీఆర్సీ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం, ట్రంక్ రోడ్డులోని గాంధీ విగ్రహం, ఏసీ సెంటర్‌లోని ఏసీ సుబ్బారెడ్డి విగ్రహం, ములుముడి బస్టాండ్ ఆజాద్ సెంటర్‌లోని వివేకానంద విగ్రహం, నర్తకి సెంటర్‌లోని ఎన్టీఆర్ విగ్రహం, కనకమహల్ సెంటర్‌లోని పుచ్చలపల్లి సుందరయ్య విగ్రహం, నక్కలోళ్ల సెంటర్‌లోని పట్టాభిరామిరెడ్డి విగ్రహం, బోసుబొమ్మ (ఏబీఎం కాంపౌండ్) వద్ద సుభాష్ చంద్రబోస్ విగ్రహం, వెంకటేశ్వరపురం సెంటర్‌లోని జాకీర్ హుస్సేన్ విగ్రహం, శెట్టిగుంట రోడ్డు వద్ద స్వచ్ఛ భారత్ విగ్రహం, నవాబుపేట బీవీఎస్ స్కూల్ వద్ద ఇందిరాగాంధీ విగ్రహం, మినీబైపాస్‌లోని పూలే విగ్రహం, నేతాజీ విగ్రహం, యలమవారిదిన్నెలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఫౌంటైన్ల ఏర్పాటు, ఐలాండ్ల అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా ఆయా కూడళ్లలోని విగ్రహాలకు మంత్రి నారాయణ పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు మంత్రికి ఘన స్వాగతం పలికారు.

ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ శంకుస్థాపన చేసిన 14 కూడళ్లలో ఫౌంటైన్ల పనులను త్వరలోనే పూర్తి చేస్తామని తెలిపారు. తాను శిలాఫలకాలకు ప్రాధాన్యత ఇవ్వనని, శంకుస్థాపన చేసిన రోజే అభివృద్ధి పనులను ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

ఆత్మకూరు బస్టాండ్ సెంటర్‌లోని పొట్టి శ్రీరాములు విగ్రహం స్థలమార్పు చేయాలని ఆర్యవైశ్యులు కోరారని, అందరూ ఏకాభిప్రాయానికి వస్తే విగ్రహాన్ని మార్చి ఆ కూడలిని కూడా సుందరంగా తీర్చిదిద్దుతామని మంత్రి తెలిపారు.

నెల్లూరు నగరంలో 17 పాఠశాలలను ఆధునీకరించేందుకు చర్యలు చేపట్టామని మంత్రి చెప్పారు. ఇప్పటికే 8 పాఠశాలల్లో పనులు జరుగుతున్నాయని, 3 పాఠశాలలను అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేసి ప్రారంభించామని తెలిపారు. మరో 3 పాఠశాలలకు త్వరలో శంకుస్థాపన చేయనున్నట్లు వెల్లడించారు.

నగరంలో ప్రతిరోజూ 10 అభివృద్ధి పనులకు భూమిపూజ చేసేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి నారాయణ తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేకున్నప్పటికీ 123 మున్సిపాలిటీల అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రూ.50 వేల కోట్లు కేటాయించారని చెప్పారు. ఇప్పటికే రూ.23 వేల కోట్ల విలువైన అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయని తెలిపారు.

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల కంటే ఎక్కువగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని మంత్రి నారాయణ పేర్కొన్నారు. డిసెంబర్‌లోపు ఇంటింటికీ కుళాయి కనెక్షన్లు అందించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మంత్రి వెంట కార్పొరేషన్ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు ఉన్నారు.

## మురికివాడల్లేని పట్టణాన్ని నిర్మించడమే లక్ష్యం..!
### -ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి







**జనసముద్రం న్యూస్ ,సెప్టెంబర్ 26 ,పల్నాడు జిల్లా ప్రతినిధి**

మురికివాడల్లేని మాచర్ల పట్టణాన్ని నర్మించడమే లక్ష్యమని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి తెలిపారు. శనివారం పట్టణంలోని 6,7,8,10వ వార్డుల నందు ఎమ్మెల్యే సుడిగాలి పర్యటన చేశారు. వార్డుల్లో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం, తాగునీరు, విద్యుత్ సరఫరాలు వంటి పలు సమస్యలపైమున్సిపాల్అధికారులతో సమీక్షించారు. స్థానికులతో మాటామంతి నిర్వహించి. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వార్డుల్లో చేపట్టిన అమృత్ స్కీం పనులను పరిశీలించారు.

8వ వార్డు నూతనంగా నిర్మిస్తున్న వాటర్ ఓవర్ హెడ్ ట్యాంకును పరిశీలించారు. అనంతరం పలువురిని పరామర్శించి ధైర్యం చెప్పారు.

ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారులు గబ్రూనాయక్, మున్సిపల్ కమిషనర్ వేణుబాబు,టీడీపీనాయకులుయాగంటిమల్లికార్జున రావు, కజ్జం సైదయ్య, మద్దిగపు వెంకటరామిరెడ్డి, యెనుముల కేశవరెడ్డి, రాజబోయిన మధు, కొమెర దుర్గారావు, శశిరెడ్డి, బీజేపీ నాయకులు క్రాంతి కుమార్, జనసేన నాయకులు లాల్ కిషన్, నర్రా రాముడు,కమాలకర్,భాగంహనుమంతరావు,వంక యాలపాటి రాజుకుమార్, చల్లాసాంబ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా గణపతి ఉత్సవాలు - 5 వేల మందికి అన్న సమారాధన

**జన సముద్రం న్యూస్**
**ఏలూరు జిల్లా సెప్టెంబర్ 26 ద్వారకాతిరుమల**

ద్వారకాతిరుమల గ్రంథాలయం సెంటర్ కొప్పిశెట్టి వారి వీధిలో 5వ వార్షికోత్సవ గణపతి నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం శ్రీ విఘ్నేశ్వర యూత్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ అన్న సమారాధనకు విశేష స్పందన లభించింది. సుమారు 5,000 మంది భక్తులు అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

కమిటీ సభ్యులు మరియు గ్రామస్థుల సహకారంతో ఈ కార్యక్రమం అత్యంత విజయవంతంగా నిర్వహించబడింది.

ఈ కార్యక్రమానికి ద్వారకాతిరుమల ఎస్సై టి. సుధీర్ విచ్చేసి స్వయంగా భక్తులకు అన్న ప్రసాదం వడ్డించారు. వీరితోపాటు ఇమ్మడి రత్నాజీ, ఇమ్మడి నాగు, గోరంట్ల చంద్ర, కోపల్లి గోపి, కోట అంజిబాబు, పెద్దింటి సత్తిబాబు, కంప సాటి రామకృష్ణ, శ్రీ విఘ్నేశ్వర యూత్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.





సోమవారం నిమజ్జనోత్సవం.

నవరాత్రి ముగింపు వేడుకలను ఈ నెల 28న సోమవారం ఘనంగా నిర్వహించనున్నట్లు శ్రీ విఘ్నేశ్వర యూత్ కమిటీ తెలిపింది.

ఆరోజుస్వామివారినిరకరకాలపూలతోఅలంకరించి, చిత్రవిచిత్ర వేషధారణలతో పురవీధుల్లో ఊరేగించి నిమజ్జనం చేయనున్నట్లు పేర్కొన్నారు.

## నవంబరు 8న ఇజితిమా జయప్రదం చేయాలి:
### -మదరసా ట్రస్ట్ నిర్వాహకులు అబ్దుల్ సుభాన్

**ఒంటిమిట్ట, జన సముద్రం న్యూస్, సెప్టెంబర్ 26 :**

ఒంటిమిట్టలోని మదర్సాలో నవంబరు 8న ఇజితిమా జయప్రదం చేయాలని జామియా నూరుల్లా ఇస్లామిక్ ట్రస్ట్ మధురాస నిర్వాహకులు అబ్దుల్ సుబహాన్ పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమానికి రాష్ట్ర నలుమూలల నుంచి మత పెద్దలు, ప్రముఖులు, ఇతరులు హాజరుకానున్నట్లు తెలిపారు. ఇజితిమా కార్యక్రమం ద్వారా ఆధ్యాత్మిక, సామాజిక అంశాలపై చర్చించేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

కార్యక్రమానికిఅవసరమైన ఏర్పాట్లు చేపడుతున్నట్లు వివరించారు. ఇజితిమాకు పరిసర ప్రాంతాల ప్రజలతో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వారు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అందరూ సమయానికి హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన పెన్షన్ల పంపిణీ కార్యక్రమం ద్వారా పేదలకు ఆర్థిక చేయూత అందించారు. నిరుపేదలకు నిరంతరం సహాయం అందించేందుకు ట్రస్ట్‌కృషి చేస్తోందని నిర్వాహకులు తెలిపారు.





భవిష్యత్తులోనూ ఇలాంటి సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని అబ్దుల్ సుబహాన్ పేర్కొన్నారు. సమాజంలోని దాతలు తమకు తోచిన విధంగా పేదలకు సహాయం అందించి సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని కోరారు.

## ఒంటిమిట్ట పి హెచ్ సి నీ ఆకస్మిక తనిఖీ చేసిన డిప్యూటీ డీఎంహెచ్ఓ





**ఒంటిమిట్ట జనసముద్రం న్యూస్ సెప్టెంబర్ 26**

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం అదనపు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి,లెప్రసి,ఎయిడ్స్ మరియు టీబీ అధికారి డాక్టర్ రవిబాబు ఆకస్మికంగా తనిఖీ చేసి ఉద్యోగుల హాజరు పట్టికను పరిశీలించి తదుపరి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో జరుగుతున్న లెప్రసి సర్వే గురించి డాక్టర్ అరుణ జ్యోతి ని అడిగి తెలుసుకొని, తగు సూచనలను చేసి 100 శాతం సర్వే పూర్తి అయ్యేలా చూడాలని ఆదేశించారు.ల్యాబ్ రికార్డులను తనిఖీ చేసి ల్యాబ్ టెక్నీషియన్ ను క్షయ వ్యాధిగ్రస్తులకు చేస్తున్న పరీక్షలు,రికార్డుల నిర్వహణ గురించి అడిగి తెలుసుకున్నారు.క్షయ వ్యాధి గ్రస్థులకు అందుతున్న చికిత్స, రికార్డుల నిర్వహణ గురించి ఫార్మాసిస్ట్ అరుణ ను అడిగి తెలుసుకున్నారు.

## అంగన్‌వాడీ కేంద్రంలో ఆకస్మిక తనిఖీ రికార్డులు, పిల్లల హాజరుపై పీడీవో పరిశీలన

**మొగల్తూరు సెప్టెంబర్ 26**
**జనసముద్రం పశ్చిమగోదావరి జిల్లా ప్రతినిధి**

పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు మండలం పేరుపాలెం సౌత్ గ్రామపంచాయతీ పరిధిలోని 061 మేళంవారి మెరక అంగన్‌వాడీ కేంద్రాన్ని పంచాయతీ డెవలప్‌మెంట్ అధికారి పి. కుమారి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా కేంద్రంలోని నిర్వహణ, పిల్లల హాజరు, రికార్డులను పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు అందుతున్న సేవలపై సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. కేంద్రాన్ని పరిశు



భ్రంగా ఉంచడంతో పాటు పిల్లలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు.

## చలో ఢిల్లీ కార్యక్రమన్నీ జయప్రదం చేయండి



**జనసముద్రం న్యూస్,విశాఖపట్నం,సెప్టెంబర్27**

చలో ఢిల్లీ డిసెంబర్ 1,2,3 తేదిల కార్యక్రమం జయప్రదం చేయండి. కార్మిక హక్కుల కోసం, ఉద్యోగ భద్రత కోసం, ప్రజాస్వామ్య హక్కులు పరిరక్షణ కోసం, జివిఎంసి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో అగనంపూడి జోనల్ ఆఫీస్ ఆవరణలో పారిశుధ్యం కార్మికుల విస్తృత సమావేశం నిర్వహించారు. గొలగాని అప్పారావు గాజువాక, అగనంపూడి, పెందుర్తి జోన్లో బాధ్యుల కార్యదర్శి సీనియర్ వైస్ ప్రెసిడెంట్ కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతూ, 4 లేబరు కోడ్లను రద్దు చేయాలని వేతనాలు పెంచాలని, డెత్,& రిటైర్మెంట్ ఖాళీ పోస్టు కార్మికుల బిడ్డల వారసులచే భర్తీ చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షించాలని శాశ్వత స్వభావం కలిగి కాంట్రాక్టు/ఔట్ సోర్సింగ్ వర్కర్స్ కు ప్రభుత్వం రెగ్యులర్ చేసి పర్మినెంట్ ఉద్యోగులతో సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. నక్క నాగరాజు అధ్యక్షులు, ఎన్. రాజు, సత్యవతి, నాగమణి, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు

## వెల్దుర్తి లో నూతనంగా ప్రారంభమైన 3వ బాలికల గురుకుల పాఠశాల

## గౌరవనీయులైన తల్లిదండ్రులు అందరికీ గొప్ప శుభవార్త

**జనసముద్రంన్యూస్, పల్నాడు జిల్లా, మాచర్ల నియోజకవర్గం, వెల్దుర్తి, సెప్టెంబర్ 26;**

మన పల్నాడు జిల్లా యందు నూతనంగా మూడవ బాలికల గురుకుల పాఠశాలను మాచర్ల నియోజకవర్గం లోని వెల్దుర్తి లో జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రాంగణంలో నూతనంగా ప్రారంభించడం జరిగినది.

ఈ స్కూలు యందు ఐదవ తరగతి, ఆరవ తరగతి, ఏడవ తరగతి మరియు ఎనిమిదో తరగతిలోకి బాలికలకు ప్రవేశం కలదు.

దయచేసి మీకు తెలిసిన బంధువులకి శ్రేయోభిలాషులకి ఈ విషయం తెలియపరచినచో ఆడపిల్లలకి మంచి విద్యను అందించినట్లుగా భావిస్తున్నాము. కావున త్వరపడండి.




వెంటనే కొత్తగా ప్రారంభించిన పాఠశాలను సందర్శించండి. మరిన్ని వివరాలకు.. పాఠశాల సిబ్బంది, వెల్దుర్తి బీసీ బాలికల గురుకుల పాఠశాల, సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్లు : 9010723711, 9014348654, 7659940999.

## మొల్లపర్రు శ్రీమత్యనారాయణ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



**మొగల్తూరు సెప్టెంబర్ 26 జనసముద్రం పశ్చిమగోదావరిజిల్లా ప్రతినిధి**

పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు మండలం పేరుపాలెం సౌత్ గ్రామం కనకదుర్గమ్మ బీచ్లో వేంచేసి ఉన్న శ్రీ మత్యనారాయణ స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయాలలో భక్తులకు అన్నసంతర్పణ నిర్వహించారు. ఆలయ నిర్వహణ కమిటీ సభ్యులు భక్తులకు అసౌకర్యం కలగకుండా తగిన పర్యవేక్షణ నిర్వహించారు. గ్రామం నలుమూలల నుండి సుమారుగా 400 మంది భక్తులు పాల్గొని శ్రీమత్యనారాయణ స్వామి వారి ప్రసాదమును స్వీకరించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

## మున్సిపల్ సిబ్బంది కి నూతన యూనిఫాం వస్త్రాలను అందజేసిన ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి

**జనసముద్రంన్యూస్, మాచర్ల, సెప్టెంబర్ 26;**

మాచర్ల పట్టణ మున్సిపాలిటీ నందు విధులు నిర్వర్తిస్తున్న పర్మినెంట్ సిబ్బందికి నూతన యూనిఫామ్ వస్త్రాలను ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి శనివారం అందజేశారు.

ఈ సందర్భంగా ఆయన పట్టణ పరిశుభ్రత, గ్రీనరీ అభివృద్ధికి, ప్రజా సమస్యలపై తక్షణ పరిష్కారం వంటి అంశాలపై కీలక పాత్ర పోషించాలని సిబ్బందికి సూచించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వేణు బాబు పలువురు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



## మొక్కలతో మంగాయమ్మ జ్ఞాపకాలను చిరస్థాయిగా నిలపడం అభినందనీయం

### – పర్యావరణ పరిరక్షణకు ప్రతి కుటుంబం మొక్కలు నాటి సంరక్షించాలి: ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ

**జనసముద్రం న్యూస్ ప్రతినిధి కొండబాబు కైకలూరు నియోజకవర్గం మండవల్లి మండలం , సెప్టెంబర్ 26:**

ఇంగిలిపాకలంక మాజీ సర్పంచ్ మోరు విష్ణుమూర్తి భార్య మంగాయమ్మ మృతిచెందిన అనంతరం ఆమె జ్ఞాపకార్థం ప్రతి ఇంటి పెరట్లో మొక్కలు నాటి, ఆమె జ్ఞాపకాలను చిరస్థాయిగా నిలిపేలా కుటుంబ సభ్యులు చేస్తున్న కార్యక్రమం అభినందనీయమని ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ అన్నారు.

ఇంగిలి పాకలంక గ్రామంలో శనివారం మంగాయమ్మపెద్దకర్మకార్యక్రమాన్ని నిర్వహించారు. కుటుంబ సభ్యుల ఆహ్వానం మేరకు కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ, బంధువులకు సంప్రదాయ రిటర్న్ గిఫ్ట్‌లకు బదులుగా జామ, నేరేడు, స్టార్‌ఫ్రూట్, వాటర్‌యాపిల్ తదితర పండ్ల మొక్కలను అందించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కార్యక్రమంలో ప్లాస్టిక్ వస్తువులు, బిందెలు వంటి వాటికి బదులుగా మొక్కలను అందించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు తోడ్పడటమే కాకుండా భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన పండ్లను అందించే అవకాశం ఉంటుందన్నారు. ప్రస్తుతం ఎండల తీవ్రత పెరగడం వల్ల ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, దీనికి పర్యావరణ సమతుల్యత దెబ్బతినడం కూడా ఒక కారణమని పేర్కొన్నారు.

మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణ బాధ్యతను కూడా ప్రతి ఒక్కరూ తీసుకోవాలని జయమంగళ వెంకటరమణ సూచించారు.



మంగాయమ్మ జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు చేపట్టిన ఈ వినూత్న కార్యక్రమం ఇతరులకు కూడా ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు.

ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.మొక్కలతో మంగాయమ్మ జ్ఞాపకాలను చిరస్థాయిగా నిలపడం అభినందనీయం

**-పర్యావరణ పరిరక్షణకు ప్రతి కుటుంబం మొక్కలు నాటి సంరక్షించాలి: ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ**

జనసముద్రం న్యూస్ ప్రతినిధి కొండబాబు కైకలూరు నియోజకవర్గం మండవల్లి మండలం , సెప్టెంబర్ 26:ఇంగిలిపాకలంక మాజీ సర్పంచ్ మోరు విష్ణుమూర్తి భార్య మంగాయమ్మ మృతిచెందిన అనంతరం ఆమె జ్ఞాపకార్థం ప్రతి ఇంటి పెరట్లో మొక్కలు నాటి, ఆమె జ్ఞాపకాలను చిరస్థాయిగా నిలిపేలా కుటుంబ సభ్యులు చేస్తున్న కార్యక్రమం అభినందనీయమని ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ అన్నారు.

ఇంగిలి పాకలంక గ్రామంలో శనివారం మంగాయమ్మపెద్దకర్మకార్యక్రమాన్ని నిర్వహించారు. కుటుంబ సభ్యుల ఆహ్వానం మేరకు కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ, బంధువులకు సంప్రదాయ రిటర్న్ గిఫ్ట్‌లకు



బదులుగా జామ, నేరేడు, స్టార్‌ఫ్రూట్, వాటర్‌యాపిల్ తదితర పండ్ల మొక్కలను అందించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కార్యక్రమంలో ప్లాస్టిక్ వస్తువులు, బిందెలు వంటి వాటికి బదులుగా మొక్కలను అందించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు తోడ్పడటమే కాకుండా భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన పండ్లను అందించే అవకాశం ఉంటుందన్నారు. ప్రస్తుతం ఎండల తీవ్రత పెరగడం వల్ల ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, దీనికి పర్యావరణ సమతుల్యత దెబ్బతినడం కూడా ఒక కారణమని పేర్కొన్నారు.

మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణ బాధ్యతను కూడా ప్రతి ఒక్కరూ తీసుకోవాలని జయమంగళ వెంకటరమణ సూచించారు.

మంగాయమ్మ జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు చేపట్టిన ఈ వినూత్న కార్యక్రమం ఇతరులకు కూడా ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు.

ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## నెట్ సెంటర్ల ముసుగులో అనధికారికంగా మీసేవ సేవలు నిర్వహిస్తున్న కేంద్రాలపై నర్సాపురం తహశీల్దార్ తనిఖీ







**నరసాపురం 26 జనసముద్రం**
**పశ్చిమగోదావరి జిల్లా ప్రతినిధి**

నరసాపురం లో ఏపీ సేవ పేరుతో నెట్ సెంటర్ లలో ఇ. నాగార్జున ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో మీసేవ సేవలు నిర్వహిస్తున్న మూడు నెట్ సెంటర్లను గుర్తించినట్లు తహసీల్దార్ తెలిపారు. ఏపీ సేవ కు సంబంధించిన రెవెన్యూ సేవలను ఎలాంటి అధికారిక అనుమతులు లేకుండా నిర్వహిస్తూ, అవసరమైన ధ్రువపత్రాలను సక్రమంగా అప్లోడ్ చేయకుండా ప్రభుత్వ అధికారులను, ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. నెట్ సెంటర్లలో కేవలం కరెంట్ బిల్లులు, సాధారణ ఆన్‌లైన్ సేవలు మాత్రమే నిర్వహించుకోవాలని, ఏపీ సేవ కు సంబంధించిన రెవెన్యూసేవలనుఅనధికారికంగానిర్వహించినట్లయితే సంబంధిత నిర్వాహకులపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించడమైనది.

ప్రజలు ఆధికృత మీసేవ, స్వర్ణ గ్రామం లేదా స్వర్ణ వార్డు కేంద్రాల ద్వారా మాత్రమే ప్రభుత్వ సేవలకు సంబంధించిన దరఖాస్తులను చేసుకోవాలని సూచించారు. ఆధికృత మీసేవ, స్వర్ణ గ్రామం లేదా స్వర్ణ వార్డుల నందు ప్రభుత్వం నిర్ణయించిన రుసుముల కంటే అధికంగా ఎవరైనా వసూలు చేసినట్లయితే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలని విజ్ఞప్తి చేయడమైనది. ప్రభుత్వ సేవలను ప్రజలకు పారదర్శకంగా, నిబంధనల ప్రకారం అందించేందుకు అనధికారికంగా సేవలు నిర్వహించేనెట్‌సెంటర్లపైతనిఖీలు కొనసాగుతాయని తెలియచేయడమైనది.

## ఒంటిమిట్ట హరిజనవాడ వినాయక నిమజ్జన వేడుకలు

### -పాల్గొన్న ఇంచార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు

**ఒంటిమిట్ట, జనసముద్రం న్యూస్, సెప్టెంబర్ 26:**

ఒంటిమిట్ట హరిజనవాడలో శనివారం సాయంత్రం వినాయకనిమజ్జనవేడుకలుఅత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగాయి. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఇంచార్జ్ శ్రీ చమర్తి జగన్ మోహన్ రాజు కు స్థానిక యువత, పెద్దలు యువజన సంఘాల ఆధ్వర్యంలో బ్యాండ్ మేళాలు, డప్పు వాయిద్యాలతో ఆత్మీయ స్వాగతం పలికారు. అనంతరం గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, నిర్వాహకులు శ్రీ జగన్ మోహన్ రాజు గారినిసత్కరించిగణపతిప్రతిమనుబహూకరించారు. యువత కేరింతలు, భక్తి నినాదాలు, వాయిద్యాల చప్పుళ్ల మధ్య నిమజ్జన శోభాయాత్ర ముందుకు సాగింది.

ఈ సందర్భంగా చమర్తి జగన్ మోహన్ రాజు మాట్లాడుతూ.. వినాయక ఉత్సవాలు ప్రజలందరినీ



ఒక్కతాటిపైకి తెచ్చి ఐక్యతను, సోదరభావాన్ని చాటుతాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ కలసికట్టుగా ఉంటూ గ్రామాభివృద్ధికి తోడ్పడాలని, విఘ్నేశ్వరుని ఆశీస్సులతో అందరి జీవితాల్లో సుఖసంతోషాలు, విజయాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. ఇంతటి ఉత్సాహంతో వేడుకలను క్రమశిక్షణతో నిర్వహించిన నిర్వాహకులను, యువకులను ఆయన అభినందించారు.



ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు శ్రీనివాసరాజు గజ్జల నరసింహారెడ్డి తుమ్మలగుంట ఈశ్వరయ్య మీనుగ వెంకటరమణ నల్ల గుండు వెంకటసుబ్బారెడ్డి ఎస్ వి రమణ బొబ్బిలి రాయుడు ఆలూరు వెంకటసుబ్బయ్య సాలా బాద్ బుజ్జి పెంచలయ్య కిరణ్ స్వామి కత్తి చంద్ర కత్తి ఐవారయ్య కార్యకర్తలు మరియు కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రభుత్వ స్కూళ్లను, హాస్టళ్లను తనిఖీ చేసిన తహసీల్దార్ నాగార్జున







**నరసాపురం, సెప్టెంబర్ 26**
**జన సముద్రం పశ్చిమగోదావరి జిల్లా ప్రతినిధి**

నరసాపురం మండలం వేములదీవి వెస్ట్ గ్రామపంచాయతీ పరిధిలో తహసీల్దార్ ఈ నాగార్జున శనివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. వేములదీవి వెస్ట్‌లోని సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహం, జెడ్పీ హైస్కూల్ కాపులకోడప, ఎంపీపీ స్కూల్, అంగన్‌వాడీ కేంద్రం, బీసీ సంక్షేమ హాస్టల్‌ను ఆయన తనిఖీ చేశారు. ఆయా సంస్థల్లోని సౌకర్యాలు, విద్యార్థుల హాజరు,నిర్వహణతదితరఅంశాలనుపరిశీలించారు. అధికారులు, సిబ్బందికి అవసరమైన సూచనలు చేశారు.

# అంగన్వాడీ ఉత్సవాలతో పోషకాహారంపై అవగాహన
## తల్లిబిడ్డల ఆరోగ్యమే లక్ష్యంగా మూడు రోజుల కార్యక్రమాలు

**అర్ధవీడు, సెప్టెంబర్ 26 (జన సముద్రం న్యూస్)**

అర్ధవీడు మండలంలోని అర్ధవీడు గ్రామంలో 139, 140, 141, 147, 108 అంగన్వాడీ కేంద్రాల్లో అంగన్వాడీ ఉత్సవం కార్యక్రమాలను శుక్రవారం నిర్వహించారు. సెప్టెంబర్ 25 నుంచి 27వ తేదీ వరకు మూడు రోజులపాటు ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు అంగన్వాడీ సిబ్బంది తెలిపారు.

ఈ సందర్భంగా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందుతున్న పౌష్టికాహారంపై తల్లులకు అవగాహన కల్పించారు.

మూడేళ్లలోపు పిల్లలకు బాలామృతం, పాలు, గుడ్లు తదితర పోషకాహారం అందించడం ద్వారా పిల్లల్లో పోషకాహారలోపాన్నినివారించవచ్చని వివరించారు. గర్భిణులు, బాలింతలకు బియ్యం, పప్పు, పాలు, గుడ్లు తదితర పోషకాహార కిట్లు అందిస్తున్నట్లు






తెలిపారు.

పోషకాహారాన్ని క్రమం తప్పకుండా తీసుకోవడం ద్వారా రక్తహీనతను తగ్గించడంతో పాటు తల్లులు, పిల్లలుఆరోగ్యంగాఉండేందుకుదోహదపడుతుందని పేర్కొన్నారు. మూడు నుంచి ఐదేళ్ల పిల్లలకు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అంగన్వాడీ కేంద్రాల్లో ఉచిత ప్రీ-స్కూల్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తల్లులకు వివరించారు.

చిన్నారుల శారీరక, మానసిక ఎదుగుదలకు అంగన్వాడీ కేంద్రాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని సిబ్బంది సూచించారు.

కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు, ఆయాలు, పిల్లల తల్లులు పాల్గొన్నారు

# ఏపి జెఎసి ఉపాధ్యక్షురాలు గా మువ్వల తేజ స్వరూప

**జనసముద్రం న్యూస్ ప్రతినిధి పండు బాబు**
**ఏలూరు జిల్లా కైకలూరు నియోజకవర్గం సెప్టెంబర్26:**

కైకలూరు లో దళిత ప్రజా జాయింట్ యాక్షన్ కమిటీ ఏపీ జెఎసి వ్యవస్థాపకుడు రాష్ట్ర అధ్యక్షులు గాలి ప్రసాద్ బాబు ఆధ్వర్యంలో 26 తేదీన దళిత ప్రజా జాయింట్ యాక్షన్ కమిటీ ఏపీ జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు మువ్వల తేజ స్వరూప తన నివాసం వద్ద ఏపీ జేఏసీ నియామక పత్రము ఇవ్వటం జరిగినది ఏపీ జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలుగా నాకు పదవి ఇచ్చినా రాష్ట్ర అధ్యక్షులు గాలి ప్రసాద్ బాబు కి నా యొక్క కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయ సాధన బావ జలాలు నాకు నచ్చి మహిళపై జరుగుతున్న దాడులను మరియు ఎదుర్కొంటున్న సమస్యలపై కృషి చేస్తానని అధికారులతో మాట్లాడుతూ నా వంతు ప్రజలకు ప్రభుత్వానికి అండగా నిలుస్తానని నా యొక్క పదవికి



న్యాయం చేస్తాను మాట్లాడటం జరిగింది రాష్ట్ర ఉపాధ్యక్షులు పులవర్తి జక్కయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాగితం నాగరాజు, మద్ద ప్రేమ్ కుమార్, రాష్ట్ర దళిత నాయకులు జక్కుల విజయకుమార్, గాలి మరి అన్న,గొంతు పులి జై రాజు, మరియు తదితరులు పాల్గొన్నారు

# మోదీ సుపరిపాలన కామినేని అభివృద్ధి పాలనపై దాకరం గ్రామంలో
## ఇంటింటి ప్రచారం నిర్వహించిన బీజేపీ శ్రేణులు

**జన సముద్రం న్యూస్ ప్రతినిధి పండు బాబు ఏలూరు జిల్లా కైకలూరు నియోజకవర్గ ముదినేపల్లి మండలం సెప్టెంబర్ 26:**

కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 12 సంవత్సరాల సుపరిపాలనలో దేశవ్యాప్తంగా చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో పాటు ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని ప్రజలకు వివరించేందుకు బీజేపీ నాయకులు జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి కోటప్రోలు కృష్ణ నాయకత్వంలో ముదినేపల్లి మండలంలోని దాకరం గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

ఈ సందర్భంగా పోలవరం ప్రాజెక్టు, భోగాపురం విమానాశ్రయం, అమరావతి రాజధాని నిర్మాణం వంటి రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన ప్రధాన కార్యక్రమాల గురించి ప్రజలకు వివరించారు.

అదేవిధంగా కైకలూరు శాసనసభ్యులు డాక్టర్





కామినేని శ్రీనివాస్ నాయకత్వంలో నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు తెలియజేశారు.

ముఖ్యంగా సిమెంట్ రోడ్లు, పీటీ రోడ్లు, విద్యుత్ సబ్‌స్టేషన్లు, పంట కాలువల అభివృద్ధి, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదల, ఆక్వా రైతులకు రూ.1.50 యూనిట్ విద్యుత్ వంటి ప్రజా ప్రయోజన కార్యక్రమాలను వివరించారు.

"పల్లె పల్లెకు మోదీ అభివృద్ధి సందేశం‌ గడప గడపకు కామినేని అభివృద్ధి పథం" అనే నినాదంతో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

ఈకార్యక్రమంలోముదినేపల్లి మండల అధ్యక్షురాలు సత్యవోలు నాగలక్ష్మి, నీలం మల్లేశ్వరరావు , కొల్లిపర నాగరాజు, నచ్చిరెడ్డి వెంకన్న, బండారు పాండురంగారావు, రెడ్డి నాగలక్ష్మి,వలిశెట్టి నాగజ్యోతి ఇతర కార్యకర్తలు పాల్గొన్నారు.

# కే.పీ.పాలెంలో దర్శనమిచ్చిన శ్రీ కళ్యాణి వెంకటేశ్వర స్వామి వారికి భక్తులు ప్రత్యేక పూజలు



**మొగల్తూరు సెప్టెంబర్ 26 జనసముద్రం పశ్చిమగోదావరి జిల్లా ప్రతినిధి**

పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు మండలం కేపీ పాలెం నార్త్ గ్రామంలో ఏం చేసి ఉన్న శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి వారి ఆలయము నందు శనివారం శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి వారు భక్తులకు వామన అవతారంలో ప్రత్యేక దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా గ్రామ చుట్టుపక్కల నుండి భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారి ఆలయానికి తరలివచ్చి ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చిన శ్రీ కళ్యాణి వెంకటేశ్వర స్వామి వారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు ఆలయ అభివృద్ధి కమిటీ నిర్వాహకులు యీవన దామోదర్ రావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆలయ నిర్వహణ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో భక్తులకు అన్నసంతర్పణ ఏర్పాటు చేశారు. గ్రామం నలుమూలల నుండి సుమారుగా 300 మంది భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్న అనంతరం ప్రసాదమును స్వీకరించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా కమిటీ సభ్యులు తగిన పర్యవేక్షణ నిర్వహించారు.

# కొయ్యూరులో 28న వైఎస్సార్సీపీ ఐడీ కార్డుల పంపిణీ

**జిల్లా ఇంచార్జి జన సముద్రం న్యూస్.తేది సెప్టెంబర్ 26**



కొయ్యూరు మండల కేంద్రంలోని గిరిజన భవనం వద్ద ఈ నెల 28వ తేదీ సోమవారం ఉదయం 11 గంటలకు వైఎస్సార్సీపీ ఐడీ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు బిడిజన అప్పారావు తెలిపారు.వైఎస్సార్సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు స్థానిక సంస్థల్లో పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి పాడేరు ఎమ్మెల్యే, అల్లూరి జిల్లా వైఎస్సార్సీపీ ఇన్‌ఛార్జ్ మత్స్యరాస విశ్వేశ్వర రాజు ముఖ్య అతిథిగా హాజరై పార్టీ శ్రేణులకు ఐడీ కార్డులను అందజేయనున్నట్లు తెలిపారు.మండలంలోని 33 పంచాయతీలకు చెందిన రాష్ట్ర, జిల్లా, మండల, మహిళా విభాగం నాయకులు, మాజీ ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, మాజీ వాలంటీర్లు, గృహ సారథులు, పంచాయతీ స్థాయి నాయకులు, పార్టీ కార్యకర్తలు, వైఎస్సార్సీపీ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బిడిజన అప్పారావు పిలుపునిచ్చారు.

# కొయ్యూరు పంట భూముల్లో అక్రమ నిర్మాణాలపై గిరిజనుల ఆందోళన
## 1/70 నిబంధనల అమలుపై అధికారులను ప్రశ్నించిన ఆదివాసీ జేఏసీ

**జిల్లా ఇంచార్జి జన సముద్రం న్యూస్.తేది సెప్టెంబర్ 26**

అల్లూరి జిల్లా కొయ్యూరు మండల కేంద్రంలో పంట భూముల్లో గిరిజనేతరుల నిర్మాణాలు, భూముల వినియోగ మార్పులు, సంబంధిత ధ్రువపత్రాల జారీపై సమగ్ర విచారణ చేపట్టాలని కొయ్యూరు ఆదివాసీ జేఏసీ సభ్యురాలు వంజరి సంకురమ్మ డిమాండ్ చేశారు.కొయ్యూరు ప్రధాన రహదారుల పక్కనే పంట భూముల్లో నిర్మాణాలు జరుగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆమె ఆరోపించారు. భూముల వినియోగ మార్పులకు సంబంధించిన కన్వర్షన్, ఎన్‌వోసీ సర్టిఫికెట్ల జారీలో అక్రమాలు జరుగుతున్నాయన్నఆరోపణలపై ఉన్నతాధికారులు విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తేవాలని కోరారు.షెడ్యూల్డ్ ప్రాంతాల్లో భూముల బదలాయింపు, వినియోగానికి సంబంధించిన 1/70నిబంధనలను కఠినంగా అమలు చేయాల్సిన అవసరం ఉందని సంకురమ్మ పేర్కొన్నారు. గిరిజనులు తమ అవసరాల కోసం చిన్న స్థలాన్ని



వినియోగించుకునే సందర్భంలో నిబంధనల పేరుతో అడ్డంకులు ఎదుర్కొంటుండగా, మరోవైపు పంట భూముల్లో జరుగుతున్న నిర్మాణాలపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు.కొయ్యూరు పంచాయతీ పరిధిలో కొన్ని నిర్మాణాలకు ఇంటి పన్ను రసీదులు, విద్యుత్ మీటర్లు ఎలా మంజూరయ్యాయనే అంశంపైనా విచారణ జరపాలని ఆమె కోరారు. సంబంధిత పంచాయతీ, రెవెన్యూ అధికారుల పాత్రపై కూడా సమగ్ర పరిశీలన అవసరమన్నారు.ఇదిలా ఉండగా కొయ్యూరు, చింతవానిపాలెం ప్రాంతాలకు చెందిన సుమారు 50 మంది గిరిజనులకు గృహ నిర్మాణ పథకాల్లో పేర్లు మంజూరైనప్పటికీ ఇళ్ల స్థలాలు అందుబాటులో లేకపోవడంతో ఇళ్లు నిర్మించుకోలేకపోతున్నారని సంకురమ్మ తెలిపారు. ప్రభుత్వ భవనాలు, గిరిజనుల అవసరాలకు అనువైన స్థలాలు అందుబాటులో లేవని, అయితే ప్రధాన రహదారుల వెంబడి ప్రైవేటు నిర్మాణాలు వెలుస్తున్నాయనిఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

షెడ్యూల్డ్ ప్రాంతాల్లో గిరిజనుల భూమి హక్కులు, చట్టపరమైనరక్షణలను కాపాడేందుకు అధికారులు పారదర్శకంగా వ్యవహరించాలని ఆమె కోరారు. భూముల వినియోగ మార్పులు, ఎన్‌వోసీలు, నిర్మాణ అనుమతులు, పన్ను రసీదులు, విద్యుత్ కనెక్షన్ల జారీపై ఉన్నతస్థాయి విచారణ చేపట్టి అక్రమాలు ఉంటే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.గిరిజన యువత, ప్రజలు తమ భూమి హక్కులు, చట్టపరమైన రక్షణలపై అవగాహన పెంచుకుని ప్రశ్నించే స్థాయికి రావాలని సంకురమ్మ పిలుపునిచ్చారు

# ఎంపీ మిథున్ రెడ్డిగారి నిధులతో మంజూరైన తాగునీటి బోరు





**జనసముద్రం న్యూస్, మదనపల్లి, నిమ్మనపల్లె, 26 సెప్టెంబర్ :-**

నిమ్మనపల్లిమండలం,వెంగంవారిపల్లి గ్రామపంచాయతీ సాకిబండవారిపల్లికి రాజంపేట పార్లమెంట్ సభ్యులు శ్రీ పెద్దిరెడ్డి వెంకట మిథున్ రెడ్డి గారు 3 లక్షల నిధులతో తాగునీటి బోరు మంజూరైంది. గ్రామంలో తాగునీటి కొరత ఎక్కువగా ఉండడంతో స్థానిక నాయకులు ఎంపీ గారి దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే త్రాగునీరు మంజూరు చేయడం జరిగింది.

ఈ సందర్భంగా ఈరోజు వెంగంవారిపల్లి పంచాయతీ స్థానిక నాయకుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించి, బోరు పనులను ప్రారంభించారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చొరవ చూపి బోరు మంజూరు చేసిన ఎంపీ శ్రీ పెద్దిరెడ్డి వెంకట మిథున్ రెడ్డి గారికి స్థానిక నాయకులు, గ్రామ ప్రజలు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

# కస్తూరి రాజుగారి పల్లి తాగునీటి సమస్యకు పరిష్కారం..
## మంత్రి "మండిపల్లి సహకారంతో బోరు ఏర్పాటు చేసిన యనమల మదన్మోహన్

**లక్కిరెడ్డిపల్లి జనసముద్రం న్యూస్ సెప్టెంబర్ 26**

లక్కిరెడ్డిపల్లి మండలం కస్తూరి రాజు గారి పల్లి గ్రామం కస్పాలో ఎన్నో సంవత్సరాలుగా తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్న తరుణంలో గ్రామస్తుల సమస్యకు పరిష్కారం లభించింది... గ్రామస్తుల ఇబ్బందులను తెలుసుకొని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రవాణా,యువజన,క్రీడా శాఖ మంత్రి "మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి" సహకారంతో మండల అధ్యక్షుడు యనమల మదన్ మోహన్ కస్తూరిరాజు గారి పల్లి గ్రామంలో బోరు ఏర్పాటు చేయించారు....

బోరు వేయించిన అనంతరం సమృద్ధిగా నీరు పడటంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు... ఎన్నో సంవత్సరాలుగా ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు చొరవ తీసుకున్న మంత్రి "మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి" కి, డాక్టర్ మండిపల్లి లక్ష్మీ ప్రసాద్ రెడ్డి కి, మండల అధ్యక్షుడు యనమల మదన్మోహన్ కి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజల అవసరాలను గుర్తించి, వారి సమస్యల పరిష్కారానికిసహకరిస్తున్నమండిపల్లి కుటుంబానికి గ్రామస్తులు అభినందనలు తెలిపారు..



# మాగాణిని తలపిస్తున్న రోడ్లు

**జనసముద్రంన్యూస్, పల్నాడు జిల్లా, నర్సరావుపేట, సెప్టెంబర్ 26;**



పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణ సమీపంలోని రింగ్ రోడ్డు, ఉప్పలపాడు మధ్యలో జగనన్న కాలనీ రహదారులు అస్తవ్యస్తంగా ఉన్నవి. గత వైసిపి ప్రభుత్వంలో గృహ నిర్మాణాలు పూర్తి కాలేదు. పట్టణంలో అద్దెలు కట్టలేక ప్రభుత్వం వారు ఇచ్చిన ఇళ్లల్లో నివాసం ఉంటున్న వారి అవస్థలు అంతా ఇంతా కాదు. వర్షం పడితే నడిచే మార్గం కూడా సరిగ్గా లేదు. బైకు ఆటో కూడా నడవని పరిస్థితి. వీరి ఓట్ల కోసం తప్ప వారి సౌకర్యాల గురించి ఎవరూ పట్టించుకోవట్లేదు అని అక్కడ నివాసితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు రోడ్లు మొత్తం మాగాణ్ని తలపిస్తున్నాయి. ఒక జల్లు వర్షం పడ్డా ఈ మార్గం నరకమే. నరసరావుపేట పట్టణానికి మూడు కిలోమీటర్ల దూరమే కానీ దమ్ము చేసిన వరి పొలాల్లా వున్నాయి. రోడ్లు, తాగునీరు సౌకర్యం కూడా లేదనే చెప్పాలి. అద్దె కట్టలేక ఇక్కడ అగచాట్లు పడుతున్నాం, రోడ్ల నీటి సౌకర్యం లేక పిల్లల చదువుల కోసం నరసరావుపేట పట్టణంలోనే అద్దెలు కట్టుకుంటూ జీవనం సాగించాల్సి వస్తుందని ఇక్కడ ఎవరూ ఉండటానికి ఇష్టపడటంలేదని తెలిపారు. పంచాయతీరాజ్ శాఖ ప్రజా ప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకొని సీసీ రోడ్లు వేయించాలని నివాసితులు కోరుతున్నారు.

H.O. Mobile : 9494184136
జనసముద్రం న్యూస్
ప్రతి అక్షరం జనం కోసం
JANASAMUDRAM NEWS
Telugu Daily
RNI APTEL : 16151
Published by Rajeshwari Publications
www.janasamudram.com fb/janasamudram 9494184136

Published by Rajeshwari Publications,D.No.4-3-99-1,Anantapur 515001 Rege: R.N.I.No APTEL / 2021 / 16151 for Queries Contact us @ 94941 84136, janasamudram2021@gmail.com. Follow us on www.janasamudram.com,fb / janasamudram